ప్రజాశక్తి

బుధవారం 10 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రతి నియోజకవర్గంలో అరకు కాఫీ

◆ అందుబాటులో గిరి ఉత్పత్తులు ◆ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో అరకు కాఫీ షాప్‌లు పెట్టాలని, ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని జిసిసి అధికారులను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. అరకు కాఫీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే పార్లమెంటు, అసెంబ్లీల్లో పెట్టిన కేంద్రాలను కొనసాగించాలని, మరింత సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఆమె బీచ్ రోడ్డులోని జిసిసి కార్యాలయ సమావేశ మందిరంలో ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎమ్‌డి కల్పనా కుమారి, డైరెక్టర్లు నాగరాజు, కనకరాజు, నిబ్రహీం, తదితర అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అరకు కాఫీ ఉత్పత్తుల అమ్మకాలు, దుకాణాల నిర్వహణ, గిరిజన రైతుల సంక్షేమం, బెరి బొర పురుగు వ్యాప్తి తదితర అంశాలపై సమీక్షించారు. భవిష్యత్తు కార్యాచరణపై డైరెక్టర్లు, ఇతర అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరకు కాఫీ విషయంలో ప్రత్యేక కార్యాచరణతో లాభదాయక చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అధికారులు గిరిజన రైతులతో మమేకం కావాలన్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని, కాఫీ సాగులో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా హితవు పలికారు. జిసిసి కార్యకలాపాలపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

సమీక్షలో భాగంగా పలు అంశాలపై చర్చించిన ఆమె జిసిసిలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, కొత్త నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సచివాలయాల ద్వారా సర్దుబాటు చేసే సిబ్బందిని తాత్కాలికంగా వినియోగించుకోవాలని ఎమ్‌డికి సూచించారు. జిసిసి ప్రాంగణంలో రూ.84 కోట్ల అంచనా వ్యయంతో 12 అంతస్తుల భవనం నిర్మించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. గతంలోనే ప్రపోజల్స్ రూపొందించామని, ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని అధికారులు చెప్పగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి మరొకసారి తీసుకెళ్తానని మంత్రి పేర్కొన్నారు.

రేపు సీతారాం ఏచూరి భవన్ ప్రారంభం

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ హాజరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిఠాపురం కాలనీ, కళాభారతి రోడ్డులో నిర్మించిన సీతారాం ఏచూరి భవన్ (సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం)ను ఈ నెల 11న ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ హాజరవుతారని వెల్లడించారు. అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ, జివిఎంసి ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, అభిమానులు, కార్మికులు, మహిళలు, యువతీ యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సీతారాం ఏచూరి దేశ రాజకీయాలలో ప్రముఖ పాత్ర పోషించడమే గాక దేశ ప్రయోజనాల కోసం, లౌకిక, ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం ఉద్యమించారని తెలిపారు. సైద్ధాంతిక, రాజకీయ పోరాటాలకు నాయకత్వం వహించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షిస్తాం

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీతమ్మధారలో మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడింది మైనర్లే అయినప్పటికీ వారిని ఉపేక్షించేది లేదని, కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు. మంగళవారం కెజిహెచ్ ఆవరణలోని వన్ స్టాప్ సెంటర్‌లో అత్యాచార బాధితురాలిని ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 7న సీతమ్మధారలో మూగ బాలికపై జరిగిన



మాట్లాడుతున్న రాయపాటి శైలజ

అత్యాచార ఘటన మిగతా 2లో..

విశాఖ ఉక్కుకు ద్రోహం చేస్తారా ?

▶ వార్త 2లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

▶ వార్త 3లో..

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

▶ వార్త 8లో..



అనకాపల్లిలో నిర్వహించిన నిరసన ర్యాలీలో మాజీ ఉపముఖ్యమంత్రి బూడి తదితరులు

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిపి నిరసనలు

పలువురు గృహ నిర్బంధం వార్తలు 5లో..



సమస్యలపై గిగ్ వర్కర్ల బైకు ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని డైమండ్ పార్క్ నుంచి మంగళవారం బైకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ గిగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శని, ఆది వారాలలో సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక గిగ్ వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బైకు ర్యాలీని సంఘం విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం ప్రారంభించారు.

పారిశ్రామికవేత్తల మిషన్ లాంచింగ్

◆ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, జిల్లా ఎంటర్‌ప్రూనర్‌షిప్ మిషన్ మధ్య ఎంఒయు

◆ విఎంఆర్‌డిఎ డెక్ భవన్‌లో పలు నిర్ణయాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో పారిశ్రామిక ఔత్సాహిక వేత్తల మిషన్ (డిఇఎం) లాంచింగ్ కార్యక్రమం నగరంలోని విఎంఆర్‌డిఎ డెక్ భవన్ ఐదో అంతస్తు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్)లో మంగళవారం సాయంత్రం జరిగింది. కొత్త స్టార్టప్ కంపెనీలకు, వారి ఉత్పత్తులను దేశ, విదేశాల్లో మార్కెటింగ్ చేసుకోవాలనుకునే నూతన పారిశ్రామిక ఔత్సాహిక వేత్తలకు ప్రోత్సాహకంగా ఆర్‌ఐటిహెచ్ డిస్ట్రిక్ట్ ఎంటర్‌ప్రూనర్‌షిప్ మిషన్ (డిఎంఇ) మధ్య ఎంఒయు జరిగింది. ఈ మేరకు బెంగళూరుకు చెందిన పారిశ్రామిక వేత్త మదన్ పాటిక్, సిఐఐ ఎపి మహిళా ప్రతినిధి యార్లగడ్డ గీతా శ్రీకాంత్, అరకు కాఫీ సిఇఒ రామ్ కుమార్ వర్మ, ఆంధ్రా యూనివర్శిటీ ఎ హబ్ సిఇఒ (ట్రై) వైజాగ్ రవి ఈశ్వర్ తదితరులు ఈ లాంచింగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మదన్ పాటిక్ మాట్లాడుతూ ఇంతవరకూ అర్బన్ స్థాయిలోనే ఔత్సాహిక వేత్తలు, ఎంఎస్‌ఎంఇల ప్రోత్సాహం కనిపిస్తోందని, అరకు ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాలకు విస్తారంగా సేవలను తీసుకెళ్లేందుకే ఈ ఎంఒయు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రాజెక్టును పైలట్‌గా చేపట్టామని, మిగతా 2లో..



మాట్లాడుతున్న రవి ఈశ్వర్

విశాఖ ఉక్కుకు ద్రోహం చేస్తారా ?

మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై ఆరాటం ఆపండి : సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని అనుమతులూ మంజూరు చేశాయని, త్వరలో దీనికి శంకుస్థాపన జరుగుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఢిల్లీలో ప్రకటించారని, ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వ రంగ సంస్థల ఎడల మోడీ సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు లేదా సెయిల్‌లో విలీనం గురించి ప్రస్తావనే మంత్రి ప్రకటనలో లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ల యెడల మోడీ ప్రభుత్వ ఆరాటమే కనిపిస్తోందని తెలిపారు. 2030 నాటికి దేశీయంగా 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సాధన లక్ష్యమని మంత్రి ప్రకటించారని, విశాఖ ఉక్కు, నేడు 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని, దీనిని 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచేందుకు కావలసిన భూమి, మౌలిక సదుపాయాలు, అత్యంత నైపుణ్యం, అనుభవంగల ఉద్యోగులు, కార్మికులు ఉన్నారని గుర్తుచేశారు. దేశంలోనే సముద్ర తీర ప్రాంతంలో నిర్మితమైన కీలక ప్లాంట్ ఇది అన్నారు. నాణ్యమైన స్టీల్ ఉత్పత్తిలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందన్నారు. కేవలం రూ.4980 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన ఈ ప్లాంట్ నేడు రూ.3 లక్షల కోట్ల ఆస్తి కలిగి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెంట్లు రూపంలో ఇంతవరకూ రూ.54 వేల కోట్ల ఆదాయం సమకూర్చిందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందిస్తోందన్నారు. ఈ బంగారు బాతును అన్ని విధాలా కష్టాలపాలు చేసి, నట్టేట ముంచి, ప్రైవేట్ రంగంలో ఉక్కు లక్ష్యం సాధిస్తామని మంత్రి ప్రకటించడం ప్రజల ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు అని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర మోడీ ప్రభుత్వం, ఉక్కు శాఖ సహాయ మంత్రి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై ఆరాటం ఆపి, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి అభివృద్ధి బాట పట్టించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్రలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

జివిఎంసి ప్రస్తుత పాలకవర్గం అధికారం చేపట్టిన 2021 నుంచి ఇప్పటికి నాలుగు సార్లు అధ్యయన యాత్రలు చేపట్టిందని, ఇప్పుడు మరలా ఈ నెల 15 నుండి 23 వరకు ఢిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో అధ్యయన యాత్ర చేపడుతోందని, ఈ యాత్రలకు కోట్ల రూపాయల ప్రజల నిధులు ఖర్చు చేస్తోందని ఎం.జగ్గు నాయుడు వేరొక ప్రకటనలో తెలిపారు. గతంలో చేపట్టిన అధ్యయన యాత్రల అంశాలు, అనుభవాలపై జివిఎంసి కౌన్సిల్లో చర్చించి, నగరాభివృద్ధికి చర్యలు చేపట్టిన పాపాన పోలేదని, ఇప్పుడు మరోసారి యాత్రలకు సిద్ధపడ్డారని తెలిపారు. వీటిని అధ్యయన యాత్రలనే దానికన్నా విహారయాత్రలు అంటే సరిగా ఉంటుందని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ పాలనకు భిన్నంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమి పాలన ఉంటుందని కూటమి నేతలు ప్రజలకు వాగ్దానం చేశారన్నారు. అధికారం చేపట్టాక వైసిపి బాటలోనే పయనిస్తున్నారని, ప్రజల సొమ్మును అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, వీరికీ, గత ప్రభుత్వానికీ తేడా ఏముందని ప్రశ్నించారు. విలువ ఆధారిత ఆస్తిపన్ను పేరుతో గత ప్రభుత్వం ప్రజలపై వేసిన భారాలను సరి చేస్తామని హామీ ఇచ్చి, గత ప్రభుత్వ పద్ధతిలోనే ప్రజలపై భారీ ఎత్తున పన్నుల భారం వేశారని విమర్శించారు. యాత్రలకు ఉపయోగిస్తున్న కోట్ల రూపాయలను ప్రజల తాగునీరు, విద్యుత్తు, రహదారులు, వైద్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగిస్తే ప్రజల కష్టాలు కొంతైనా తీరుతాయన్నారు. 2021 నుండి జరిగిన అధ్యయన యాత్రలపై జివిఎంసి కమిషనర్, పాలకవర్గం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బాలల సంరక్షణ చట్టాలను అమలు చేయాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : బాలల సంరక్షణ, పునరావాస చట్టాలను సక్రమంగా అమలు జరిగేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా జడ్జి చిన్నంశెట్టిరాజు అన్నారు.మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బాలల న్యాయ, రక్షణ చట్టాల అమలులో కీలకమైన సమస్యలు, సవాళ్లపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. బాలల సంరక్షణ, పునరావాసం కోసం ఉన్న చట్టాలను జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) పోక్సో చట్టం వంటి వాటిని ఎలా సమర్థంగా అమలు చేయాలి అనే దానిపై చర్చించారు. బాలల సంరక్షణలో ఉన్న పోలీస్, శిశు సంక్షేమ శాఖ, వైద్యశాఖ, న్యాయవ్యవస్థ మధ్య మెరుగైన సమన్వయం గురించి సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి మంగా కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి వరలక్ష్మి, పోలీస్‌శాఖ ఇన్స్పెక్టర్లు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అత్యాచార నిందితులను శిక్షిస్తాం

బాధాకరమన్నారు. ఆమెపై అత్యాచారానికి పాల్పడింది మైనర్లేనని, ఆమె ఇంటి దగ్గరలోనే వారూ ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై స్కూళ్లు, కాలేజీల్లో అవేర్‌నెస్ సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా కమిషన్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా కూడా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. చాలా మంది యువత మొబైల్ ఫోన్లలో పోర్న్ వీడియోలు చూసి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. బాధితురాలి తల్లి బాలికను ప్రత్యేక పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం తరఫున పావని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ శ్రీహరి, మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల మిషన్ లాంచింగ్

ఇక్కడ సక్సెస్ అయితే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల తయారీని ఇతర రాష్ట్రాలు, జిల్లాలకూ విస్తరిస్తామని అన్నారు. రవి ఈశ్వర్ మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఇక్కడి డెక్‌లో నుంచి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోగల స్టార్టప్‌లను ప్రోత్సహించేలాగ రిజిస్ట్రేషన్లు, సూచనలు, సలహాలు ఇచ్చి ముందుకు నడిపించేందుకు తయారైందన్నారు. త్వరలో తాను ఈ డెక్‌లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ అరకు కాఫీకి ట్రైబల్ ఉమెన్స్ బ్రాండ్ అంబాసిడర్‌లుగా ఉన్నారని, 20కి పైగా రాష్ట్రాలు, అనేక దేశాల్లో నేడు ఈ కాఫీ ప్రాచుర్యం పొందిందని అన్నారు. ప్రతి ఇంటి నుంచీ ఒక మహిళ పారిశ్రామిక వేత్త రావాలనే రాష్ట్ర ప్రభుత్వ ధృఢచిత్తానికి తగ్గట్టుగా విశాఖ కేంద్రంగా యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు గ్లోబల్ అలియెన్స్‌తో విస్తారంగా పారిశ్రామిక ఔత్సాహిక వేత్తలను అభివృద్ధి చేసేందుకు విశాఖ కేంద్రంగా అనేక స్టార్టప్, వ్యాపార సంస్థలు ముందుకొస్తున్నాయన్నారు. ఒక ఉత్పత్తిని ఎలా బ్రాండింగ్ చేయాలి, డిపిఆర్ తయారీ వంటి ఉచిత సర్వీసులు ఇక్కడి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా లభిస్తాయన్నారు. రామ్ కుమార్ వర్మ మాట్లాడుతూ 150 మంది మహిళా పారిశ్రామిక ఔత్సాహికవేత్తల తయారీ లక్ష్యంగా అరకు కాఫీ విషయంలో పనిచేస్తున్నామన్నారు. స్థానిక సంస్థలు కూడా కలుస్తున్నాయన్నారు. స్టార్టప్‌లను గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకు తీసుకెళ్లడం, మహిళా సాధికారత, ఎంఎస్ఎంఇల ప్రోత్సాహమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

ఆలోచిద్దాం.. బతుకుదాం : డాక్టర్ నిహాల్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జీవితంలో ఎదురయ్యే వైఫల్యం, ఎప్పుడూ ఉండే ఆర్థిక సమస్యలు, నిత్యం నీడలా వెంటాడే నిరాశ, ఇలా ఎన్ని కారణాలు జీవితాన్ని అంతం చేసుకోవడానికి ముందుకొచ్చినా, వెరవకుండా ఆలోచిస్తూ బతికితే జీవితానికి సరైన అర్థం ఉంటుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, కౌన్సెల్ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నిహాల్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం (సెప్టెంబర్ 10)ని పురస్కరించుకుని ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సమస్యలను అధిగమిస్తూ జీవనమార్గంలో చేరుకున్న ప్రతి మైలురాయీ విజయ స్తూపమే అవుతుందన్నారు. ఆ దృక్పథం ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. ఇదే ఈ సంవత్సరపు ప్రపంచ ఆత్మహత్య నివారణ దిన నినాదమని పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న బలవన్మరణాలపై అవగాహన పెంచడం, నివారణమార్గాలను చర్చించి ప్రజలలో ఆత్మస్థైర్యం నింపడం ముఖ్యోద్దేశ్యంగా ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం పాటిస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యలకుగల కారణాలు, నివారణ మార్గాలను ఆయన వివరించారు.

నగరాభివృద్ధిపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ 4వజోనల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 4వజోన్ జోనల్ కార్యాలయంలో జోనల్‌స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలని, నగరాభివృద్ధిపై జివిఎంసి ఆర్థిక పరిపుష్టిపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. 4వ జోన్ పరిధిలో ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయి, ఏ స్థాయిలో ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ప్రారంభించని గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి ధరావత్తు సొమ్మును జివిఎంసికి జమ చేయాలన్నారు. తాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, నీటి నాణ్యతను నిత్యం పరీక్షించాలన్నారు. విద్యుత్ దీపాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు.

సమాచార శాఖ ఎడి రమేష్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: విశాఖలో సమాచార పౌర సంబంధాల శాఖ ఎస్ఐసి ఎడిగా పని చేస్తున్న దున్న రమేష్‌కు డిడిగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం ఎడిగా పనిచేసిన రమేష్ జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో విశాఖలోని ఎస్ఐసికి వచ్చి సుమారు 3 నెలల పాటు సేవలందించారు. తాజాగా జరిగిన డిపిసిలో రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురు ఎడిలు పదోన్నతి పొందగా అందులో జోన్ -1 నుంచి పి.వెంకటరాజుగౌడ్, ఎల్. రమేష్‌తో పాటు దున్న రమేష్ ఉన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, లక్ష్మీపురం జెడ్పి హైస్కూల్‌లో విద్యార్థులకు భూసార పరీక్షలపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, పంట భూమిలో ఏ సమయంలో ఎరువులు వాడాలి, సూక్ష్మ, స్థూల పోషకాలు అంటే ఏమిటి, ఎరువులు వాడకంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షా కేంద్రం ఎడిఎ దాస్, డిఆర్‌సి ఎడిఎ హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం డి.సత్యారావు, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, సాయిలక్ష్మి, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో కళా ఉత్సవ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో కళ ఉత్సవ్-2025 నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 కళ రూపాల్లో, 12 విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు గూగుల్ ఫామ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నేరుగా డైట్‌లో కూడా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఎంత మంది విద్యార్థులు హాజరువుతున్నారో ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కళ ఉత్సవ్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

రణభేరి బైక్ జాతాను జయప్రదం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి -పద్మనాభం : విద్యా రంగంలోని సమస్యల పరిష్కారానికి ఈ నెల 19వ తేదీన చేపట్టే రణభేరి బైక్ జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. పద్మనాభం మండలంలోని మండలంలోని మద్ది, రెడ్డిపల్లి, పొట్నూరు, బి తాళ్లవలస, రేవిడి హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి రణభేరి జాతాలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ, బైక్ యాత్ర తర్వాత కూడా సమస్యలు పరిష్కారం కాకుంటే ఈ నెల 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల యుటిఎఫ్ అధ్యక్షులు ఎంవివిఎస్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజయ్‌బాబు, సీనియర్ నాయకులు కోలా సన్యాసిరావు, చిన్నారావు, వెంకటేష్, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'యూరియాపై వైసిపి అబద్ధ ప్రచారం'

ప్రజాశక్తి- పెందుర్తి : జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయాధికారులు ప్రకటనలు చేస్తున్నా వైసిపి నేతలు వక్రబుద్ధితో అబద్దాలు చెబుతున్నారని ఆంధ్రప్రదేశ్ గవర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు విమర్శించారు. జివిఎంసి 96వ వార్డు పరిధిలోని ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసిపి మనుగడ కోసం ఆ పార్టీ నాయకులు రోడ్డు ఎక్కుతున్నారని ఆరోపించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ రాజకీయ లబ్ధి కోసం ధర్నాకు పిలుపు ఇచ్చారని, చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అర్చకులు అధిష్టింపజేశారు. అనంతరం అంతరాలయ దర్శనం కల్పించారు.

డ్రెయినేజీపై పలకలు ఏర్పాటుచేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- సీతమ్మధార : కొమ్మాది కూడలిలో డ్రెయినేజీ కాలువపై పలకలు ఏర్పాటుచేసి ప్రమాదాలు నివారించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి మధురవాడ జోన్ -2 కమిషనర్ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, కొమ్మాది కూడలి హైవే పక్కన సర్వీస్ రోడ్డులో ఉన్న డ్రెయినేజీ కాలువపై ప్రజలు రాకపోకలు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఈ కాలువపైన సిమెంట్ పలకలు ఉండేవని, ఇటీవల జివిఎంసి చేపట్టిన కాలువల్లో పూడిక తొలగింపుల్లో సిమెంట్ పలకలను తీసే సమయంలో కొన్నిచోట్ల పగిలిపోయాయని వివరించారు. పగిలిపోయిన సిమెంట్ పలకల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో పలు చోట్ల ప్రమాదకరంగా ఉందని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులతో పాటు పశువులు సైతం కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నట్లు వివరించారు. వెంటనే స్పందించి కాల్వపైన సిమెంట్ పలకలను ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శైలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరుపున పోరాడాలి : వైసిపి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరుపున పోరాటం చేసినపుడే నిజమైన నాయకుడిగా ప్రజలు గుర్తిస్తారని వైసిపి జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు పేర్కొన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 14, 24, 25 వార్డులకు సంబంధించిన కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి నాయకులు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్న తీరును ఎండగడుతూ వార్డు స్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. వార్డులో ఉన్న కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు సమన్వయంతో వార్డు కమిటీ నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో



సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్ అనిల్ కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ బాలకోటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-మధురవాడ : కొమ్మాదిలోని గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభం కానున్న అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్ పోటీల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎ.బాలకోటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రభుత్వం ఇటువంటి పోటీలు చేపట్టడం అభినందనీయం అన్నారు. హాకథాన్ క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, అనుబంధ రంగాలలో యువ మేధావులను ప్రేరేపించడానికి విద్యా శాఖ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్ పోటీల రీజనల్ రౌండ్ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల విద్యార్థుల కోసం రీజినల్ సెంటర్‌గా గాయత్రి కళాశాలను ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో ఈ మూడు జిల్లాల నుంచి మొత్తం 35 జట్లు పాల్గొంటాయి, ఎపిఎస్‌సిహెచ్ఇ అందించిన 10 సమస్యా ప్రకటనలపై పనిచేస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతి సమస్యకూ ఒక విజేత, ఒక రన్నర్‌ను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వీరిని పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలతో కూడిన ప్యానెల్ ఎంపిక చేస్తుందని తెలిపారు. సెమీఫైనల్ రౌండ్ కోసం మొత్తం రూ.1,50,000 విలువైన బహుమతులు ఉంటాయని వివరించారు. ఈ హాకథాన్ పోటీల ప్రారంభోత్సవానికి ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య జిపి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్యామ్ సుందర్, డీన్ అచ్యుత్‌రామమ్, సిఎస్‌సి, హెచ్‌ఓడి సిబ్బంది గుసురావు, పి.రోజా, అనురాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ



అవంతిక మెహతో



దక్ష మహాలక్ష్మి నాయుడు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం : యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో గుడిలోవ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శ్రీ సరస్వతీ విద్యా విహార్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఎ.దక్ష మహాలక్ష్మి నాయుడు (8-10 సంవత్సరాల బాలుర విభాగం)లో ప్రథమ స్థానంలో నిలిచాడు. విజ్ఞాన విహార్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అవంతిక మెహతో (14-16 సంవత్సరాల బాలికల విభాగం)లో ద్వితీయ స్థానాన్ని సాధించింది. వీరు అక్టోబర్ 9 నుండి 12వ తేదీ వరకు వరకు కర్నాటకలో జరగబోయే జాతీయ యోగా పోటీల్లో పాల్గొనబోతున్నారు.

భీమునిపట్నం : ఎపి యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా, ద్వారకా తిరుమలలో జరిగిన యోగాసన రాష్ట్ర స్థాయి పోటీల్లో 14 - 16 ఏళ్ల బాలికల విభాగంలో భీమిలి సన్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఆర్.తనూజ మూడో స్థానంలో నిలిచి అక్టోబర్‌లో జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 8 -10 ఏళ్ల విభాగంలో 5వ తరగతి విద్యార్థి ఇ.శశిధర్ 4వ స్థానంలో, 10 - 12 ఏళ్ల విభాగంలో 5వ తరగతి విద్యార్థిని వెన్నెల 5వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. వీరిని పాఠశాలలో కరస్పాండెంట్ అభినందించారు.



తనూజ

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలోని బిఆర్‌టిఎస్ రహదారిలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న వ్యాన్, బైక్ ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... అడవివరం నుంచి హనుమంతవాక వైపు ఒక మినీ లారీ ఇటుక లోడుతో వస్తోంది. అదే సమయంలో ఎదురుగా రాంగ్ రూట్‌లో కేంద్రకారాగారం వద్ద గల శ్రీకృష్ణాపురం ప్రాంతంలో నివాసం ఉంటున్న రొంపిల్లి హరీష్ (28), గుడ్ల గోవిందరాజు (34) ద్విచక్రవాహనంపై అడవివరం వైపు వెళ్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న హరీష్, గోవిందరాజు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

జాతీయ పోషకాహార వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ పోషకాహార వారోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఈ వారోత్సవాలలో భాగంగా నగరంలోని వివిధ పాఠశాలలలో గీతం ఫార్మశీ విద్యార్థులు పోషకాహారంతో కూడిన ఆహార పదార్థాలను, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. పోషకాహార లోపాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో అధిక శాతం మంది పోషకాహార లోపాల కారణంగా వివిధ వ్యాధులకు గురవుతున్నారని, పట్టణ ప్రాంతాలలో ఊబకాయం, మధుమేహం వంటివి పెరుగుతున్నాయని తెలిపారు. పోషకాహారం రోజువారి దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సౌజన్య, డాక్టర్ జివి.రాధ, డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ ఆర్‌బి.నలంద తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

'మన డబ్బులు - మన లెక్కలు' యాప్ శిక్షణ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం 'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌పై శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులు పాల్గొని తమ లెక్కల నిర్వహణపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా డిపిఎం వైదేహి మాట్లాడుతూ, ఈ యాప్ ద్వారా ప్రతి సంఘమూ తమ పొదుపులు, అప్పులు, రుణాలు, లావాదేవీలను సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రియల్ టైమ్ రికార్డులు పొందగలుగుతారని, దీనివల్ల పారదర్శకత పెరిగి, సభ్యులకు భవిష్యత్తులో రుణ సదుపాయాలు పొందేందుకు సులభతరం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బిటి.ఎస్తేరురాణి, సిసిలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన ఉత్తరప్రదేశ్ రైతులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ మోడళ్లను ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతులు, నేషనల్ రిసోర్సెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పి.తరుణ్ ఆదిత్య, శ్రీను పరిశీలించారు. కాంపాక్ట్ బ్లాక్‌లో సాగుచేస్తున్న వివిధ పద్ధతులను పరిశీలించారు. మోడల్ మేకర్ రామారావు ఎ-గ్రేడ్ మోడల్‌లో వేర్వేరు పంటలు, వాటి ద్వారా లభించే ఆదాయం గురించి వివరించారు. అనంతరం కర్రి రాంబాబు పొలంలో అమలు చేస్తున్న పిఎండిఎస్, లైవ్ మల్చింగ్ పద్ధతులను రైతులకు వివరించారు.

ఎన్ఎఫ్ఎ- హెచ్ఆర్ బి.శ్రీనివాస చక్రవర్తి పొలంలో సాగు చేస్తున్న ఎటిఎం మోడల్‌ను పరిశీలించిన రైతులు, ఈ విధానంలో ఎదురయ్యే సమస్యలు, లాభాలపై ఆయనతో చర్చించారు. ఎటిఎం మోడల్ ద్వారా 365 రోజులపాటు పలు పంటలు సాగు వలన నిరంతర ఆదాయం వస్తుందని, పురుగు, తెగుళ్ల బెడద తగ్గుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తర్లువాడ యూనిట్ ఇన్‌ఛార్జి రెల్లి పైడిరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను ప్రయివేటీకరించొద్దు



ఫకీర్‌తకియాలో పాదయాత్ర చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

11న పాతగాజువాక బహిరంగసభను జయప్రదం చేయండి

విశాఖలో పలుచోట్ల ప్రచారం



నెహ్రూనగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన పాత గాజువాకలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని విశాఖలో పలుచోట్ల మంగళవారం ప్రచారం నిర్వహించారు.

గాజువాక : ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కమిటీ ఆధ్వర్యంలో పకీర్ తకియా, ఎస్‌సి కాలనీ, పరిసర ప్రాంత అపార్ట్‌మెంట్లలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. ఈ పాదయాత్రలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రింటింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, సిబ్బంది ఆర్‌కె.నాయుడు, టి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్ నుండి పూర్ణా మార్కెట్ వరకు ప్రచార ర్యాలీ చేపట్టారు. జోన్ నాయకులు ఎం సుబ్బారావు, పి.చంద్రశేఖర్, టి.నూకరాజు, ఎం.ఈశ్వరరావు, నయేమి, డి.ఎల్లయ్యమ్మ, ఐ.వరలక్ష్మి, పి.కిషోర్ పాల్గొన్నారు.

సీతమ్మధార : నరసింహనగర్, తారక రామారావునగర్, తాటి చెట్ల పాలెం, కాలనీలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. డివైఎఫ్ఐ అధ్యక్షులు వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : గాజువాకలో బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి 59వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, నాయకులు బూడి శ్రీను, కె.రమణ, కార్యకర్తలు దున్న రాజేష్, వై.గంగాధర్, సుభాని, సురేష్, ఈశ్వరరావు హేమంత్, దుర్గారావు, రామకృష్ణ, ప్రశాంత్, పైడినాయుడు, కుమార్ పాల్గొన్నారు.



పూర్ణామార్కెట్‌లో ప్రచారం చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు



మాట్లాడుతున్న ఆర్.లక్ష్మణమూర్తి

గరికిపాటి రాజారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- ములగాడ : ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు గరికిపాటి రాజారావు 62వ వర్ధంతిని 59వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి ప్రజా నాట్యమండలి నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, వై.గంగాధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, రాజారావు గొప్ప రచయిత, దర్శకుడు అన్నారు. కళ కళ కోసం కాదు ప్రజల కోసం అని అనేక కళారూపాలు ప్రదర్శించారని తెలిపారు. రాజారావు ఆశాయ సాధనలో ప్రజానాట్యమండలి కళాకారులు నడుచుకున్నప్పుడే ఆయనకు మనమిచ్చే ఘన మైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, శ్రీను, సురేష్, రమణ, కుమార్, హేమంత్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాహిత్య సభలో మాట్లాడుతున్న వక్త

'జాషువా గబ్బిలం'పై సాహిత్య సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : సమతా సాహితీ విశాఖపట్నం ఆధ్వర్యంలో మంగళవారం 'మానవీయ సాహిత్య చిహ్నం జాషువా గబ్బిలం' అంశంపై పౌర గ్రంధాలయంలో సాహిత్య సభ నిర్వహించారు. కవి డాక్టర్ బండి సత్యనారాయణ స్వాగతం పలుకగా సమతా సాహితీ ప్రతినిధి డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజంలో కుల వివక్ష ఉన్నంత కాలం గబ్బిలం లాంటి కావ్యాలు వస్తూనే ఉంటాయని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత గుంటూరు లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ, గబ్బిలంలోని మానవీయ సాహిత్య విశేషాలను వివరించారు. గబ్బిలం బహుజన తాత్విక చింతనను సరైన పద్ధతిలో సోదాహరణంగా నమోదు చేసిందని తెలిపారు. గబ్బిలంలోని పద్యాలను పాడి సభికులను అలరించారు. రచయిత డాక్టర్ కెవిఎస్.మూర్తి మాట్లాడుతూ 'గొప్ప మానవీయ విలువలతో కూడిన కావ్యం కాబట్టే గబ్బిలం నేటికీ ప్రజల మధ్య నిలిచి ఉందన్నారు. జాషువా కవిత్వంలోని విశేషాలను వివరించారు. కవులు సియార్కే, ఎస్.హనుమంతరావు, మిరప మహేష్, ఉప్పల అప్పలరాజు, నగరానికి చెందిన రచయిత, ప్రముఖులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఎపిటిఎఫ్ నిరసనల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాధవధార : ఎపి టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు విశాఖ జిల్లా ఎపిటిఎఫ్ అధ్యక్షులు కరుణాకరరావు తెలిపారు. ఈ మేరకు ఎపిటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిరసన వారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ, పెండింగులో ఉన్న డిఎలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పిఆర్‌సి ప్రకటించాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని నిరసన వారాన్ని ప్రకటించినట్లు తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు కోతపెట్టే వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. తక్షణమే డిమాండ్ల సాధన కోసం నల్ల బ్యాడ్జిలతో మండల, జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శన, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేత, సిఎం, సిఎస్‌లకు వాట్సాప్, ఇమెయిల్ ద్వారా వినతులు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణారావు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డులో రూ.88.9 లక్షలతో పలు పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజల కోరిక మేరకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నజీర్, స్థానిక కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిఇ విజయ్‌కుమార్, ఎఇ శ్రీనివాసరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణా నగర్ ప్రాంతంలో వీధి కుక్కలతో ఇబ్బందిగా ఉందని స్థానికుల ఫిర్యాదుల మేరకు వార్డు టిడిపి అధ్యక్షులు ముక్కా కిశోర్‌కుమార్ స్పందించారు. జివిఎంసి అధికారులతో మాట్లాడి సిబ్బందిని రప్పించి రామకృష్ణానగర్ ప్రాంతంలో కుక్కలను పట్టించి వ్యాన్‌పై తరలించారు. వార్డులోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని కిశోర్‌కుమార్ చెప్పారు.

సిపిఎం నాయకులు వీరభద్రరావు మృతి

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు వై.వీరభద్రరావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. వారం రోజుల క్రితం హృదయ సంబంధ వ్యాధితో కిమ్స్ హాస్పిటల్‌లో వీరభద్రరావు చేరారు. లంగ్స్ ఇన్ఫెక్షన్, నాడీ వ్యవస్థ ఇబ్బందుల వల్ల మరణించినట్లు డాక్టర్లు చెప్పారు. వీరభద్రరావు కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని ప్రజాప్రయోజనార్థం కెజిహెచ్‌కు దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. బుధవారం ఉదయం 9:30 గంటలకు వారి ఇంటి నుండి అంతిమయాత్ర బయలుదేరి కెజిహెచ్‌కు చేరుకుంటుంది. అక్కడ శరీరాన్ని దానం చేయనున్నారు.

వీరభద్రరావు 1950లో తూర్పుగోదావరి జిల్లా, పత్తిపాడు మండలం, వాకపల్లి గ్రామంలో రాములు, సీతాయమ్మ దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం శంఖవరం జిల్లా పరిషత్తు పాఠశాలలో సాగింది. కాకినాడలో ఐటిఐ పూర్తిచేశారు. గోపాల్ ఆటోమోటివ్‌లో అప్రెంటిస్ చేశారు. 1978లో నేవల్ డాక్ యార్డు పిజిఎస్ విభాగంలో కార్మికునిగా చేరారు. తర్వాత యార్డ్ యుటిలిటీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయి అక్కడే 2010 వరకు పనిచేసి విరమణ పొందారు. వామపక్ష భావజాలానికి ఆకర్షితులై సిఐటియు అభిమానిగా విశాఖ రక్షణ రంగంలో దాని పటిష్టతకు అవిరళ కృషి జరిపారు. నివాస ప్రాంతాలలో యువజన సంఘం నిర్మాణానికి సహకరించారు. కుటుంబ సభ్యులు ప్రజా ఉద్యమాలలో పనిచేసేటట్టు ప్రోత్సహించారు. ఐఎన్‌సిఇ యూనియన్ ప్రజాతంత్ర పద్ధతిలో పనిచేయుటకు, ఎన్‌సిఇ యూనియన్ నిర్మాణానికి, దాన్ని పటిష్టతకు తీవ్రంగా కృషి చేశారు. ఆయన చిన్న కుమారుడు ఎడ్ల అంజని రాజేష్ ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ కోపరేటివ్ సొసైటీ కార్యదర్శిగా ఉన్నారు.



నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు తదితరులు



వీరభద్రరావు (ఫైల్)

పలువురి పరామర్శ

వీరభద్రరావు మృతివార్త తెలుసుకున్న పలువురు తోకాడ చేరుకొని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఎస్.జ్యోతీశ్వరరావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. తోకాడలోని వీరభద్రరావు చిన్నఅబ్బాయి ఇంటి వద్ద బుధవారం ఉదయం 8.30 గంటలకు సంతాప సభ ఏర్పాటు చేయనున్నట్లు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు తెలిపారు.

'ప్రియదర్శిని'లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : గాంధీనగర్ వుడా కాలనీలోని ప్రియదర్శిని ఉన్నత పాఠశాలలో హెల్త్ డొమైన్, లీ ఫార్మా సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆంత్రోపోమెట్రిక్ కొలతలు, ఫిట్ ఇండియా ప్రొటోకాల్ పరీక్షలు, వైద్యులచే శారీరక పరీక్షలు జరిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచుకోవాలో విద్యార్థులకు సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి, డాక్టర్ రాధిక, క్యాంప్ కో-ఆర్డినేటర్ సరోజిని, జయలక్ష్మి, పోషకాహార నిపుణులు మాధురి, భాగ్యలత, పాఠశాల కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ మార్కండేయులు, లీ ఫార్మా సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిపి నిరసనలు



నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నిరసిస్తూ వైసిపి అధిష్టానం పిలుపు మేరకు అన్నదాత పోరులో భాగంగా అనకాపల్లిలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా పోలీస్ యంత్రాంగం వైసిపి కార్యాలయానికి చేరుకొని ప్రదర్శనగా వెళ్లవద్దని సూచించగా, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు, నాయకులు కరణం ధర్మశ్రీ, వరుదు కళ్యాణి, డాక్టర్ బిబి సత్యవతి, మాధవి, మలసాల భరత్ కుమార్ తదితరులు ప్రదర్శనగా వెళ్లి తీరుతామని కరాఖండిగా తేల్చి చెప్పారు. తమ ర్యాలీకి పోలీసులు ఆటంకం కల్పించడం సరికాదన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి గూడ్స్ రోడ్డు మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రైతులకు యూరియా తక్షణమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరిన ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆందోళనకు అనుమతులు ఇవ్వాలని కోరినప్పటికీ ఆంక్షలు విధించి అణిచివేయాలని చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంబాల జోగులు, దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకి రామరాజు, జాజుల రమేష్, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం / నర్సీపట్నం టౌన్ : పోలీసు నిర్బంధాల నడుమ వైసిపి అన్నదాత పోరు ఆందోళన విజయవంతమైంది. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో అబీద్ సెంటర్‌లో అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి, న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసి పాత్రుడు, గొలుగొండ ఎంపిపి గజ్జెల మణికుమారి, చోద్యం కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ పెద్దిరాజు, నాలుగు మండలాల వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

కొత్తకోట : కొత్తకోటలో వైసిపి నేతలు నిరసన చేపట్టారు. డిసిసిబి మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ మాట్లాడుతూ రైతుల ఇబ్బందులపై ఆందోళన చేస్తున్న వైసిపి నేతల ముందస్తు అరెస్ట్ దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోవరాజు, తలారి ఆదిమూర్తి, పందల దేవ, ఎంపిటిసి పూడి దేవ, సీతిని చిరంజీవి, పాండు పాల్గొన్నారు.

భీమునిపట్నం : వైసిపి భీమిలి నియోజక వర్గ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భీమిలిలో 'అన్నదాత పోరు' పేరుతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎండిఒ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ సుధాకర్‌కు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, పేడాడ రమణికుమారి, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నేతల గృహ నిర్బంధం

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం : వైసిపి అన్నదాత పోరు కార్యక్రమం సందర్భంగా ఆ పార్టీ నేతలను జిల్లా వ్యాప్తంగా ఎక్కడి కక్కడ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కోట వురట్ల మండలంలో మాజీ ఎమ్మెల్సీ డిపి సూర్యనారాయణ రాజు, వైసిపి నాయకులు కిల్లాడ శ్రీనివాసరావులను, చోడవరంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ గాడి అప్పారావు, నాయకులు ఓరుగంటి నెహ్రూ, పందిరి శ్రీనులను, కశింకోట మండలంలో మలశాల కిషోర్, మళ్ల బుల్లిబాబు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజులను గృహ నిర్బంధం చేశారు. బుచ్చయ్యపేట మండలంలో జెడ్‌పిటిసి దొండా రాంబాబు, వైసిపి నాయకులు కొల్లిమల్ల ఆచంనాయుడు, జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజులను, పాయకరావుపేట మండలంలో చిక్కాల రామారావును, పరవాడలో పైల శ్రీనివాసరావు, బంధం నాగేశ్వరరావు, కోన రామారావులను, సబ్బవరం మండలంలో గండి రవికుమార్, శేషుబాబు, కొటాన రాములను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నర్సీపట్నంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎంపిపి సుర్ల రాజేశ్వరిలను, గొలుగొండలో కొరుప్రోలు పాణిశాంతారామ్, సుర్ల బాబి లోచల సుజాక్ష, సూకిరెడ్డి రామకృష్ణనాయుడు, కసిపల్లి అప్పారావులను, మాకవరపాలెంలో రుత్తల యర్రాపాత్రుడు, చిటికెల వెంకటరమణ, రుత్తల సత్యనారాయణ, అయ్యప్పలను, నాతవరం మండలంలో ఎంపిపి సాగిన లక్ష్మణమూర్తి, పైలా సునీల్, బండారు పైడినాయుడు, అడిగర్ల నాయుడుబాబు, లాలం లోవరాజులను, నక్కపల్లి మండలంలో వీసం రామకృష్ణ, శీరం నరసింహమూర్తిలను, చీడికాడలో గొల్లవిల్లి రాజబాబును గృహ నిర్బంధం చేశారు.


మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజును హౌస్ అరెస్టు చేసిన దృశ్యం


మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ తదితరులు

టెన్త్ జీవశాస్త్ర మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా జీవశాస్త్రం ఉపాధ్యాయుల ఫారం తయారు చేసిన 10వ తరగతి జీవ శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు డీఈవో కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ మెటిరియల్ 2025-26వ సంవత్సరంలో 10వ తరగతి విదార్థులు 100 శాతం జీవ శాస్త్రంలో మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందని డిఇఒ చెప్పారు. ఎస్సీఈఆర్టీ నూతన మూల్యాంకన పత్రం ఆధారంగా మెటిరియల్ రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. అనుభవం గల, తరగతి గదిలో ప్రయోగాత్మక వినియోగించే ఉపాధ్యాయుల ద్వారా ఈ మెటీరియల్ రూపొందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా జీవ శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ గౌరవ అధ్యక్షులు కప్పల ప్రసాద్, అధ్యక్షులు సీహెచ్.గిరి ప్రసాద్, కార్యదర్శి బికెవి. గోవిందరావు పాల్గొన్నారు.

11న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక


ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈనెల 11న వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి పరమేశ్వరరావు తెలిపారు, కార్యక్రమానికి విద్యుత్ శాఖ డీఈ ఏవిఎన్ఎం అప్పారావు హాజరవుతారని పేర్కొన్నారు. గృహ వినియోగదారులు, వ్యవసాయ విద్యుత్తు లైన్ల దుకాణదారులు, ఇండస్ట్రీస్, తదితర సమస్యలు ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

సర్వ శిక్ష అభియాన్ నిధులు విడుదల

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలోని 10 పాఠశాలలకు సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ.170.755 లక్షల నిధులు విడుదలైనట్లు ఎమ్మెల్యే బండా సత్యనారాయణ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నిధులు పాఠశాలలో ల్యాబ్ ఎక్యుమెంట్, టాయిలెట్స్‌కు మంజూరు చేయడం జరిగిందన్నారు. కె.కోటపాడు మండలానికి రూ.61.375 లక్షలు, మాడుగులకు రూ.76.95 లక్షలు, రూ.చీడికాడకు రూ.16 లక్షలు, దేవరాపల్లి మండలానికి రూ.16.45 లక్షలు మంజూరైనట్లు చెప్పారు.

పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లకు సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పిఎసిఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన 'పూడి సత్యరావు'ను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో చైర్మన్ సత్యరావుతో పాటు డైరెక్టర్ గొంతెన నర్సింహా నాయుడులను సన్మానించారు. నిబద్ధతతో పనిచేసి సొసైటీని బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా సత్యారావు తెలిపారు. అనంతరం మహిళా సంఘానికి మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కును, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పోతల పాత్రునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు గొర్రెపోటు రామూర్తి నాయుడు, బీజేపీ మండల అధ్యక్షురాలు అవుగడ్డ సత్యవేణి, కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు గొర్లె గోవింద, దొగ్గ దేముడు నాయుడు, చామంతుల సన్యాసిరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, టిడిపి నాయకులు శరకాన సూర్యనారాయణ, కడిమి నాగేశ్వరరావు, బందం అప్పలరాజు, చల్లా తాతీయులు, డిసిసిబి బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.


పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లను సత్కరించిన ఎమ్మెల్యే బండారు


మాట్లాడుతున్న డాక్టర్ రామదాస్

సముద్ర సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సు

ప్రజాశక్తి-పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో సముద్ర సాంకేతిక పరిజ్ఞానంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గిడుగు రామదాస్ హాజరై ప్రసంగించారు. మహాసముద్రాలు అంతులేని సంపదలకు నిలయమని, అటువంటి ఆ సముద్రాలను, మహాసముద్రాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సముద్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సముద్రాల నుండి వచ్చిన అపరిమితమైన వనరులు, వాటిని పొందేందుకు, అధ్యయనం చేసేందుకు ఉపయోగించే పరికరాలు, వాటి సాంకేతితకతను వివరించారు. ప్రస్తుతం భారత దేశం సముద్రయాన్ అభియాన్ ద్వారా మత్స్య 6000 అనే జలాంతర్గామిని రూపొందించి మానవులను ఆరువేల అడుగులు లోతులకు పంపగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణుని ఆలయానికి గ్రానైట్ పలకలు అందజేత

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాదిలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి అవరమైన గ్రానైట్ పలకలను వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ రూ.ఒక లక్ష తన సొంత నిధులు వెచ్చించి అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కురుందాసు మాలి బాబు, తదితరులు నరేష్‌ని ప్రత్యేకంగా అభినందించారు. మరో ఆరు నెలల్లో ఫినిషింగ్ పనులు పూర్తి చేసి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

జిల్లా పోలీసు శాఖకు జాగిలం

ప్రజాశక్తి-అనకాపల్లి : మంగళగిరి పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుండి ట్రాకింగ్, పేలుడు పదార్థాలు గుర్తించడంలో శిక్షణ పొందిన జాగిలం రియో మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుంది. దీనిని ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా పరిశీలించి, డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించే జాగిలాల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో కేసుల ఛేధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కొత్త జాగిలం "రియో"ను తీసుకొచ్చినట్లు తెలిపారు. బెల్జియం మలనాయిస్ జాతికి చెందిన ఈ ఆడ జాగిలం, విజయవాడ మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ 6వ బెటాలియన్‌లో 10 నెలలపాటు ట్రాకింగ్, పేలుడు పదార్థాలు గుర్తించడం వంటి ప్రత్యేక శిక్షణ పొందిందని పేర్కొన్నారు. డాగ్ స్క్వాడ్ మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు రియో తోడ్పడుతుందని చెప్పారు. ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా డాగ్ స్క్వాడ్‌కు ఈ జాగిలంతో మొత్తం 8కి చేరింది. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణ, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ఆదినారాయణ, డాగ్ హ్యాండ్లర్లు ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ రాజీవ్ రాయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఎస్పికి అభివాదం చేస్తున్న జాగిలం రియో

టిడ్కో కాలనీలో బోర్లు వేయాలని వినతి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ టీడ్కో కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టిడ్కో కాలనీలో 512 ఇళ్లు ఉన్నాయని, జీవీఎంసీ ద్వారా వచ్చే నీరు కలుషితమై ఉండటం వల్ల తాగడానికి పనికిరావడం లేదని పేర్కొన్నారు. ఆ నీటివల్ల జ్వరాలు, కీళ్ల నొప్పులు, టైఫాయిడ్ వంటి వ్యాధులు విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో బోర్లు వేస్తే స్థానిక ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని, అందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ఐద్వా నేతలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండల కేంద్రంలోని వినయ్ విద్యాసంస్థలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్కూల్ కరెస్పాండెంట్ బత్తుల వాసు ఆధ్వర్యాన స్కూల్ ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులు, సిబ్బందికి చర్మ, దంత వైద్య పరీక్షలను అచ్యుతాపురం శ్రీవిష్ణు మెడికల్ హాస్పిటల్ వారు నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

గౌరమ్మ చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం గొబ్బూరు గౌరమ్మ చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని గొబ్బూరు గ్రామానికి చెందిన బుద్ద వెంకటరమణ డిమాండ్ చేశారు. రామ్‌కో సిమెంట్ కంపెనీ వారు ఈ చెరువును ఆక్రమణ చేసి సర్వీస్ రోడ్డు వేశారని, దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆక్రమణకు గురైన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ చెరువు 3 ఎకరాల 83 సెంట్లు ఉండగా సిమెంట్ కంపెనీ వారు ఆక్రమణ చేసి సర్వీసు రోడ్డు వేశారని తెలిపారు. రెవిన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలు తొలగించి చెరువును రైతులకు అందుబాటులోకి తీసుకోవాలని కోరారు. మళ్ల గణేష్ మాట్లాడుతూ కంపెనీ వలన చెరువు మూసుకుపోయి చెరువులో నీరు నిల్వ ఉండడం లేదని, నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గిరిజనులకు దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలకు మంజూరైన దోమలతెరలను మంగళవారం దేవరాపల్లిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గిరిజనులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ముందస్తు చర్యగా దోమలతెరలను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవి సువర్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అనంత ఉమాదేవి, జామి అప్పారావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

మండల కేంద్రం దేవరాపల్లిలోని ఎరకలపేటలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. రూ.25 లక్షలతో నిర్మించిన ఈ భవనం సమావేశాలకు, శుభకార్యాలకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, పంచాయతీ సెక్రటరీ అనంత ఉమాదేవి, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పరవాడ : జీవీఎంసీ 79వ వార్డులో రూ.3 కోట్ల 35 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ శేషాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూటమి సీనియర్ నాయకులు పైలా జగన్నాధరావు, మాసరపు అప్పలనాయుడు, పిల్లా శివకృష్ణ, మచ్చ శివకుమార్, బొడ్డపు శ్రీనివాస్ కాసుల, వియ్యపు చిన్న, మోటూరు సన్యాసినాయుడు, పొన్నూరు వెంకటరమణ, బుగిడి రామ గోవిందరావు, దుల్ల రామునాయుడు, వర్రి పరదేశి నాయుడు, వెన్నెల నరసింహారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అక్రమ లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, రైతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : "అక్రమ లేఅవుట్‌తో నీట మునిగిన వరి పంట" అనే శీర్షికతో ఈనెల 7న ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. వరిముంపు ప్రాంతం, అక్రమ లే అవుట్‌ను మంగళవారం ఇన్‌ఛార్జి తహశీల్దారు శాంతి భూషణ్, వీఆర్వో ఎరుకు నాయుడు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తరతరాలుగా సుమారు 300 రైతు కుటుంబాలు తమ భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ ఉన్నామని, వర్షాకాలంలో అధికంగా ఉన్న నీరు ఒక మడి నుంచి ఒక మడిలోకి ప్రవహించి తన శ్మశాన వాటిక పక్కనున్న కాలువ ద్వారా శారద నదిలో కలవడం రివాజుగా వస్తుందని చెప్పారు. అయితే ఈ మధ్య కొంతమంది నీటి ప్రవాహానికి అడ్డంగా భూమిని కప్పి లే అవుట్ వేయడంతో ఎగువన ఉన్న పొలాలు మొత్తం నీటి ముంపుకు గురై తీవ్ర నష్టం వాటిల్లుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి అధికారులు పరిష్కారం చూపకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఇప్పటికే ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దారు స్పందిస్తూ రివాజు ప్రకారం ఎగువ నుంచి దిగు నీరు ప్రవహించేలా విడిచి పెట్టాలని ఆదేశించారు. లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు ముత్త నూక నాయుడు, ముత్త శ్రీను, ముత్తా రమణబాబు, పన్నీరు నూక నాయుడు, సేనాపతి సూరిబాబు, కర్రి చైతన్య పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో 54,465 హెక్టార్లకు గాను, ఇంతవరకు, 50676 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి అయ్యాయని, ఇప్పటి వరకు 9286 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 298.41 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. జిల్లాకు 1800 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. యూరియా సమాచారం కొరకు జిల్లా కంట్రోల్ రూమ్ : 8331056471, అనకాపల్లి డివిజన్ : 8331056383, చోడవరం డివిజన్ : 8331056402, ఎలమంచిలి డివిజన్ : 8331056389, నర్సీపట్నం డివిజన్ : 8331056410, పాయకరావుపేట డివిజన్ : 8331056395 నెంబర్ల సంప్రదించాలని కోరారు.

యూరియాపై వైసిపి ప్రచారం సరికాదు

అనకాపల్లి రూరల్ : యూరియాపై సోషల్ మీడియాలో వైసీపీ తప్పుడు ప్రచారాలు చేసి పబ్బం గడుపుతుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రజలను తప్పు దోవ పట్టించడానికే యూరియా కొరతను ఫేక్ ప్రచారం చేస్తున్నారన్నారు. మండలంలో ఈనెల 10 నుండి తగరంపూడి, వెంకుపాలెం, పిసినిగాడ, మామిడిపాలెం రైతు సేవా కేంద్రాలలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని నర్సీపట్నం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివిఎస్ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కె.కోటపాడు, వారాడ సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్పుడం కారణంగా కె.కోటపాడు, గొండుపాలెం, కింతాడ, దాలివలస, మర్రివలస, గొట్లాం, కె.సంతపాలెం, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, వారాడ, పిండ్రంగి, ఆనందపురం, ఆర్‌వై అగ్రహారం, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షులుగా లోవరాజు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని రేవుపోలవరం గ్రామానికి చెందిన కొడ లోవరాజు తెలుగు యువత మండలాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ శ్రేణులు మంగళవారం లోవరాజును నక్కపల్లిలోని మంత్రి స్వగృహం వద్ద ఘనంగా సత్కరించాయి. తనకు ఈ అవకాశం కల్పించిన ఏపీ హోంమంత్రి అనితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ ఎంపీపీ వినోద్ రాజు, మండల మాజీ అధ్యక్షుడు వెంకటరాజు, కోరుప్రోలు పీఏసీఎస్ అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే లాభాలు



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న కిల్లి కృపారాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే లాభాలబాట పడుతుందని కేంద్ర మాజీ మంత్రి, పిసిసి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. ఏపిసిసి నెంబర్ సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి కృపారాణి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శిబిరంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి దీక్షలో కూర్చున్నారు. ఈ రోజుతో ఇక్కడ ఉక్కు జెఎసి చేపట్టిన దీక్షలు 1624 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ కృపారాణి మాట్లాడుతూ, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఎన్డీయే ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తోందని, ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రైవేట్ బడా కంపెనీలకు లక్షల కోట్లు రుణమాఫీ చేసిన బిజెపి ప్రభుత్వం వేల కోట్లు స్టీల్‌ప్లాంట్ రుణాన్ని మాఫీ చేయలేరా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు డి.ఆదినారాయణ,మంత్రి రాజశేఖర్,అయోధ్యరామ్, జిల్లా కార్మిక, ప్రజాసంఘాల జెఏసి వైస్‌చైర్మన్ భోగవిల్లి నాగభూషణం, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్, కె.దేవా, కాంగ్రెస్ నాయకులు గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

బాలింతలు, గర్భిణులు ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పౌష్టికారం తినాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి అన్నారు. మంగళవారం కోటపాడులోని మూడు అంగన్వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో సంకల్ప ప్రోగ్రాం ద్వారా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిడిపిఓ పి.లలిత కుమారి, సూపర్వైజర్ ఎల్వీ సుశీల, కోటపాడు -1, 2, 3 అంగన్వాడి వర్కర్లు కుమారి, లక్ష్మి, గౌతమి, హెల్పర్స్ కాసులమ్మ, మణి, మహిళా పోలీస్ శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-పరవాడ : మహిళా హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, మండల అధ్యక్షురాలు బంగారమ్మ పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరవాడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళల సమస్యలు, హక్కుల సాధన కోసం నిరంతరం ఐద్వా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గృహ హింస, దోపిడీ, అసమానత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ అన్నపూర్ణ, సీత, కె.లక్ష్మి, మంగమ్మ, గోపాలరావు, రమాదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-పరవాడ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును పరవాడ శ్రీమరిడిమాంబ కళ్యాణ మండపంలో మంగళవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందజేశారు. మండలంలోని లంకెలపాలెం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి శ్రీనివాసరావు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయమై ఎమ్మెల్యే రమేష్‌బాబు దృష్టికి రాగా, సీఎం సహాయనిధికి దరఖాస్తు చేశారు. రూ.2,34,285 చెక్కు మంజూరు కాగా, బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్ రావు, ఇందల వెంకటరమణ, పైలా జగన్నాధరావు, కన్నూరు వెంకటరమణ, వర్రి పరదేశి నాయుడు, బొడ్డపు శ్రీనివాస్ కాసుల, వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

క్వారీల యజమానులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : క్వారీల యజమానులు నిబంధనలు పాటించాలని, ఆయా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆర్డిఓ షేక్ ఆయిషా తెలిపారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో మంగళవారం శ్రీలక్ష్మి నరసింహ మెటల్స్, సాండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు గతంలో ఏర్పాటు చేస్తున్న అనేక క్వారీలు, గ్రామాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు చేయలేదని తెలిపారు. వారి వారి వ్యాపార అభివృద్ధి చేసుకుంటూనే గ్రామాలకు, ప్రజల ఆరోగ్యానికి హాని జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా అన్నవరం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సింద్రి కోమలకు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్సును విరాళంగా అందించగా, ఆ నిధితో కూడిన రూ.4,04,890 చెక్కును అందజేసినట్లు ఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్.తిలక్ బాబు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

బదిలీ హెచ్ఎమ్‌కు సన్మానం



హెచ్ఎం దంపతులను సన్మానిస్తున్నఎంఇఒ తదితరులు

ప్రజాశక్తి-గొలుగొండ : బదిలీ అయిన మండలంలోని రావణాపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పద్మజను మంగళవారం గొలుగొండ ఎంఇఒ సత్యనారాయణ, పిఆర్‌టియు నాయకులు జి.గోపినాథ్, పాఠశాల హెచ్ఎం హరికృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, స్కూల్ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కల్లు సత్యనారాయణ, చోద్యం పిఎసిఎస్ మాజీ చైర్మన్ కిలపర్తి పెద్దిరాజు, కొల్లు రాము, కొల్లు లోవరాజు, కొల్లు శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి-చీడికాడ : మండల కేంద్రంలో గ్రామ దేవత పరదేశమ్మ తల్లి పండగను మంగళవారం కామారెడ్డి, బొబ్బిలి, బొడ్డు వారి కుటుంబీకులు ఘనంగా నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామదేవతకు మొక్కులు తీర్చుకున్నారు.

విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేసిన సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలో గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గోల్డెన్ స్టార్ అవార్డులను అందజేశారు. ప్రతి తరగతిలో ర్యాంకులను బట్టి పదిమంది చొప్పున విద్యార్థులను గుర్తించి వారికి హెచ్ఎం సత్య కుమార్, సంస్థ డైరెక్టర్ లోవకృష్ణ చేతుల మీదుగా బ్యాడ్జెస్, జామెట్రీ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ లోవ కృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన,తల్లిదండ్రులు లేని విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ చేయూతనిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని సిహెచ్ లక్ష్మీపురం, జానకయ్యపేట గ్రామాల్లో శానిటేషన్ పనులను మంగళవారం ఎంపిడిఒ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు పరిశీలించారు. ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. గ్రామంలో ఎక్కడా చెత్త కుప్పలు కనిపించకూడదని, పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ చేయించారు.

అదనపు వైద్యాధికారిని నియమించాలి



ఆందోళన చేస్తున్న సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట పిహెచ్‌సిలో మరో వైద్యాధికారి పోస్టును తక్షణమే నియమించాలని సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం పిహెచ్‌సి వద్ద నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య తదితరులు మాట్లాడుతూ కొత్తకోట పిహెచ్‌సి పరిధిలో టి.అర్జాపురం, కోట్నాబెల్లి, జెడ్ బెన్నవరం, చీమలపాడు, పి పొన్నవోలు పంచాయతీ పరిధిలో 29 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. కొండ ప్రాంతాలను అనుకొని ఉండడంతో గ్రామాల్లోని గిరిజనులు తరచూ మలేరియా, విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు.. గతంలో కొత్తకోట పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులుండేవారని, ఒకరు పిహెచ్‌సిలో ఓపీ చూస్తే, మరో వైద్యాధికారి గిరిజన గ్రామాలలో వైద్య ఆరోగ్యశిబిరాలు నిర్వహించే వారన్నారు. ఇపుడు ఒక్కడే డాక్టర్ ఉండడంతో గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహణకు వీలులేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి అదనపు వైద్యాధికారిని తక్షణమే నియమించాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ సురేఖకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ వలసయ్య, సింగరపు ఆపారావు పాల్గొన్నారు.

ఏటిగైరంపేట ఎరువుల దుకాణం తనిఖీ



ఏటిగైరంపేట ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏటిగైరంపేట ఎరువుల దుకాణాన్ని డిఎల్‌పిఒ, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, వ్యవసాయాధికారి సుధారాణి మంగళవారం తనిఖీ చేశారు.స్టాక్‌ను తనిఖీ చేసి, రిజిస్టర్‌ను పరిశీలించారు. మండలంలో ఎరువుల కొరత లేదని,రైతు సేవా కేంద్రాలు, ఏడు ప్రైవేటు దుకాణాల్లో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, సర్పంచ్ రామకృష్ణ, నాయకులు నల్లబెల్లి స్వామి, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

మండలంలో యూరియా కొరత లేదని తహశీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. గ్రామ టిడిపి అధ్యక్షులు గోవిందు పాల్గొన్నారు.

నక్కపల్లి : వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు మాత్రమే ఎరువులు వాడాలని ఎంపిడిఒ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు సూచించారు. మండలంలో దొంకాడ, దొంకాడ కొత్తూరు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం

49వ రోజుకు దళిత రైతుల దీక్ష



దీక్షల్లో పాల్గొన్న జి.కోడూరు దళిత రైతులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : రాళ్ళ క్వారీని రద్దు చేయాలని నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మాకవరపాలెం మండలం జి కోడూరు గ్రామ దళిత రైతుల నిరాహార దీక్ష మంగళవారం 49వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 49 రోజులుగా పనిపాట మానేసి న్యాయం చేయాలని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దీక్షలు చేస్తుంటే దళితులమనే చులకన భావనతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ళ క్వారీని రద్దుచేసేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్ట చేశారు.కార్యక్రమంలో ఏఐబిఎస్పి రాష్ట్ర కార్యదర్శి బహుజన బొట్టా నాగరాజు, రైతు సంఘం నాయకులు అప్పారావు, పెంటయ్య, లోవరాజు, చిరంజీవి, నాగభూషణం, సతీష్, గణేష్ పాల్గొన్నారు.

హైవోల్టేజీ నష్టాలపై ఫిర్యాదు



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలో గర్ల్ హైస్కూల్ రోడ్డు నుండి బెంగళూరు అయ్యంగారి బేకరీ వరకు హైవోల్టేజీతో ఇళ్లల్లో, షాపుల్లో ఉన్న ఇన్వెర్టర్స్, ఫ్రిజ్‌లు, మిక్సీ తదితర ఎలక్ట్రికల్ వస్తువులు పాడౌతున్నాయని స్థానికులు గెంజి శ్రీనివాసు, కరణం నూకరాజు, మధు, లొట్ల అప్పారావు, క్రరి హేమలత ఆందోళన వ్యక్తం చేశారు.

దీనిపై స్థానిక విద్యుత్ లైన్‌మ్యాన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. అక్కడ సైతం విద్యుత్ సిబ్బంది సమస్యపై తగు రీతిలో స్పందించకుండే, రేపు చేస్తాంలే అని హేళనగా మాట్లాడారని బాధితులు అసహనానికి గురయ్యారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

రోగి కాలులో కణితి తొలగింపు



రోగితో ఆపరేషన్ చేసిన డాక్టర్ రవి కిరణ్

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రోగి కాలులో ఉన్న భారీ కణితిని ఆపరేషన్ చేసిఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రవికిరణ్ తొలగించారు. ఉద్దండపురం గ్రామానికి చెందిన తుమ్మల రాజారావు కాలులో కణితి ఏర్పడడంతో నడవడానికి ఇబ్బందులు పడేవాడు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రవికిరణ్ కలిసి సమస్యను విన్నవించాడు. ఈ మేరకు రోగికి పలు ఆరోగ్య తనిఖీలు చేసిన డాక్టర్ రవి కిరణ్, మంగళవారం ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి, కాలులోని కేజీన్నర కణితిని తొలగించారు. దీంతో రోగి ఆనందం వ్యక్తం చేయగా, డాక్టర్ రవికిరణ్‌ను పలువురు అభినందించారు. డాక్టర్ రవి కిరణ్ సేవలను పలువురు కొనియాడారు.

అజేయపురంలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ సురేఖ, వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు శివారు అజేయపురంలో మంగళవారం కొత్తకోట పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 22 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేయగా, ఒకరికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని దోమతెరలు వాడాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, ఎంఎల్‌పిహెచ్ లక్ష్మి, జోషిణి, ఎఎన్ఎం భవాని, ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10 వ తరగతి విద్యార్థులకు కర్తవ్యమే దైవం అనే అంశంపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సేవా సమితిప్రతినిధులు నున్న విశ్వేశ్వరరావు, కొత్త సాయిరాం భగవాన్, కక్కిరాల సురేష్ తెలిపారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీల్లో విజేతలకు సాయిబాబా జయంతి రోజున పుట్టపర్తిలో బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. వ్యాసరచన పోటీలను హెచ్ఎం ఎస్.జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్‌వివిఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, కుమారి, వి.పద్మావతి, నాగేశ్వరరావు, రమేష్ బాబు, శ్రీదేవి పర్యవేక్షించారు.

ఆదుకోవాలని ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్త్రీశక్తి పథకంతో మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో రూ.25వేల వాహన మిత్ర ప్రకటించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పాత బస్‌స్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్స్, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ, .లక్షలాది మంది ఆటోలనే జీవనోపాధిగా ఉన్నారని, వడ్డీలుకు రుణాలు తెచ్చి ఆటోలు కొనుక్కున్న వీరంతా ఇపుడు నెలసరి వాయిదాలు చెల్లించలేని స్థితిలో ఉన్నారన్నారు. ఆటో కార్మికుల బతుకుకు ప్రభుత్వం భరోసా కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్, సిఐటియు నాయకులు సత్తిబాబు వేములపూడి, రాజు గుండుపాల, బంగారం నాతవరం, బాలకృష్ణ, యర్రవరం, నానిబాబు పాములవాక కృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కారణంగా ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. దీనికి ముందు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కలెక్టర్ కార్యాలయం ర్యాలీగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల గోవింద నాయకులు మార్కండేయులు, సూరిశెట్టి బాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో సిఐటియు ఆధ్వర్యాన ఆటో కార్మికుల నిరసన

కె.కోటపాడు : మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల తాము రోడ్డున పడ్డామంటూ మంగళవారం కె.కోటపాడు మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. అరగంట పాటు ఆందోళన కొనసాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆటో డ్రైవర్లను ఆందోళనను విరమింప చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు అముజూరి దేవుడిబాబు, వంటాకు రామకృష్ణ, మొల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

వడ్డాది : కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా ఆటో డ్రైవర్లు వడ్డాదిలో ఆటోలు నిలిపివేసి కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం వడ్డాది నుండి ర్యాలీగా అనకాపల్లి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లారు. ధర్నాకు బయలుదేరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు కోవెల వెంకటరమణ, వెలుగుల నాగేశ్వరరావు, నాళం వెంకటరమణ పాల్గొన్నారు.

మునగపాక : ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఆటో స్టాండ్ వద్ద మంగళవారం ఆటో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ జిల్లా ఆటో ఫెడరేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ శ్రీ షిరిడి సాయి ఆటో స్టాండ్ వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మధురెడ్డి, సన్యాసి రావు, నర్సింగ్, పాల్గొన్నారు

పెందుర్తి : పెందుర్తి జంక్షన్‌లో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) డ్రైవర్లతో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ సమావేశమయ్యారు. ఈనెల 11న చేపట్టే ఆటో ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోరా పైడిరాజు, గొలగాని మురళి, చందవరపు వేణు పాల్గొన్నారు

క్వారీ పేలుళ్ల నష్టాల పరిశీలన


స్థానికులతో మాట్లాడుతున్న తహశీల్దార్ నాగమ్మ

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని శరభవరం పంచాయతీ రాజన్నపేట గ్రామంలో క్వారీలో రాళ్ల బ్లాస్టింగ్ వల్ల బీటలు వారిన ఇళ్లను మంగళవారం తహశీల్దార్ సీహెచ్.నాగమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి వివరాలు సేకరించారు. క్వారీలో బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లు బీటలు వారుతున్నాయని, టీవీలు, ప్యాన్లు పాడవుతున్నాయని తహశీల్దార్‌కు స్థానికులు గోడును వెల్లబుచ్చారు. రామాలయం గోడ పగిలిపోయిందని విన్నవించారు. దీనిపై ఆర్‌డిఒకు నివేదిక అందజేస్తామని తహశీల్దార్ నాగమ్మ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ పి.రామ్మూర్తి, విఆర్ఒ కె..అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు గ్రూపునకు డ్రోన్ మంజూరు


డ్రోన్ అందిస్తున్నఎఒ సంధ్యారాణి

ప్రజాశక్తి-గొలుగొండ : సాగులో మరింత సహకారం అందించేందుకు వ్యవసాయ శాఖ ద్వారా అయ్యప్ప రైతు గ్రూపునకు డ్రోన్ మంజూరు చేసినట్లు స్థానిక మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి తెలిపారు. మంగళవారం గ్రూపు సభ్యులకు డ్రోన్‌ను అందజేశారు. రూ.9.80లక్షల విలువైన డ్రోన్‌ను గ్రూపు సభ్యులు రూ.2 లక్షలు చెల్లించగా, మిగిలిన రూ.7.80లక్షలు ప్రభుత్వం రాయితీగా బ్యాంకు సహకారంతో అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు నానిబాబులు, గెడ్డం నానాజీ, బ్యాంకు, వ్యవసాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

కుప్పకూలిన పురాతన భవనం


కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం/ నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం పాత బస్ స్టేషన్ సమీపంలోని పురాతన భవనం మంగళవారం తెల్లవారుజామున కుప్పకూలింది. కూలిన భవనంలో బియ్యం షాపు ఉండగా, పక్కన ఉన్న చెప్పుల దుకాణంపై భవనం స్లాబ్ వెళ్లి పడడంతో పూర్తిగా రెండు దుకాణాలు ధ్వంసమయ్యాయి, అయితే రాత్రి సమయంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ఆస్తి నష్టం మినహా ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు, సమాచారం అందుకున్న వెంటనే మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భవన శకలాలను తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. పట్టణంలో ఇటువంటి శిథిలమైన భవనాలు పలుచోట్ల ఉన్నాయని, వ వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం నర్సీపట్నం పరిధి మాకవరపాలెంలోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పది కొత్త మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో నిర్మించాలని విడుదల చేసిన జీవో నెంబర్ 590ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, ఆరోగ్య రంగాన్ని లాభాపేక్ష కోసం ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దారుణమన్నారు. ప్రభుత్వం హయాంలోనే మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం చివరి దశలో ఉన్నాయని, వీటిని పూర్తి చేసి వైద్య సేవలు వెంటనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు ప్రతిభకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయని, అదే ప్రైవేట్ యాజమాన్యాలు సంపన్నులకే సీట్లు ఇస్తాయని పేర్కొన్నారు. వ్యాపార దృక్పథం ముందుకు వచ్చి పేద ప్రజలకు వైద్యం అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగంపై ప్రభుత్వ ఆజమాయిషి లేక అధిక ఫీజులు, అడ్మిషన్లు వాటిలో డొల్లతనం అనేక సందర్భాల్లో బయటపడిందని గుర్తు చేశారు. వైద్య విద్య, ఆరోగ్యం ప్రజా హక్కులను ప్రైవేటు లాభాల కోసం తాకట్టు పెట్టడం సరైనది కాదని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఫీజుల భారం వలన సాధారణ ప్రజలకు వైద్య విద్య అందని పరిస్థితి తలెత్తిందని, ఈ తరుణంలో ప్రభుత్వమే కొత్త మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నిర్మాణం చేసి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

కరాటేలో దీక్షిత క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖపట్నం తాడిచెట్లపాలెం ఆశీర్వాద కల్యాణ మండపంలో ఈ నెల 7న జరిగిన మూడవ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2025లో అనకాపల్లి దీక్షిత కరాటే అసోసియేషన్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. పి.సంప్రీత్, బి.శివకార్తీక్‌లు కటలో గోల్డ్ మెడల్స్, కుమిటీలో గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే బి.వరుణ్ తేజ్ కటలో గోల్డ్ మెడల్, ఆర్.సహస్ర కటలో గోల్డ్ మెడల్, యమ్.నవ్యశ్రీ గోల్డ్ మెడల్, ఎ.దివ్య కటలో సిల్వర్ మెడల్, కుమిటిలో గోల్డ్ మెడల్, పి.నిఖిత కటలో గోల్డ్ మెడల్, కుమిటిలో సిల్వర్ మెడల్, యమ్.శ్రీనిధి కటలో సిల్వర్ మెడల్, యమ్.గౌతం కటలో సిల్వర్ మెడల్, బి.అవినాష్ కటలో సిల్వర్ మెడల్, కుమిటిలో సిల్వర్ మెడల్, కె.వర్షిత్ కటలో గోల్డ్ మెడల్, కుమిటిలో సిల్వర్ మెడల్, ఎ.ప్రణీత్ కటలో గోల్డ్ మెడల్, కమిటీలో బ్రాంజ్ మెడల్, జోషిత కటలో బ్రాంజ్ మెడల్, కుమిటిలో బ్రాంజ్ మెడల్, ఎస్.కార్తీక్ కటలో బ్రాంజ్ మెడల్, కుమిటిలో బ్రాంజ్ మెడల్, వి.శ్యామ్ కటలో సిల్వర్ మెడల్, కుమిటిలో బ్రాంజ్ మెడల్, డి.బాల భవ్యశ్రీ కటలో బ్రాంజ్ మెడల్, చతుర్వాద కటలో బ్రాంజ్ మెడల్, కుమిటిలో సిల్వర్ మెడల్, చిన్మయి కటలో బ్రాంజ్ మెడల్, విష్ణు ప్రియ కటలో బ్రాంజ్ మెడల్, ఎస్.ప్రవీణ్ కటలో బ్రాంజ్ మెడల్, కుమిటీలో బ్రాంజ్ మెడల్, బి.శశిధర్ కటలో బ్రాంజ్ మెడల్, కె.యశ్వంత్ కటలో బ్రాంజ్ మెడల్, ఆర్.లాలా కటలో బ్రాంజ్ మెడల్, ఎస్.కార్తికేయ కటలో బ్రాంజ్ మెడల్, ఆశ్లేష కటలో సిల్వర్ మెడల్, టీ.హృతిక్ రోషన్ కటలో సిల్వర్ మెడల్, కుమిటీ సిల్వర్ మెడల్, టీ.హంసవల్లి కటలోసిల్వర్ మెడల్, ఎస్.శ్యామ్ ప్రవీణ్ కటలో బ్రాంజ్ మెడల్ సాధించారు. వారిని కోచ్ టి. ఈశ్వర్‌రావు అభినందించారు.


పతకాలు సాధించిన చిన్నారులు

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

నర్సీపట్నం డివిజన్, అనకాపల్లి జిల్లా | బుధవారం 10-09-2025 | 8 పేజీలు

వాణిజ్య ఖిల్లా.. నర్సీపట్నం

◆ ఏజెన్సీ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ◆ పలు రంగాల్లో అభివృద్ధి
◆ అనకాపల్లి జిల్లాలో ప్రధాన కేంద్రంగా గుర్తింపు



నర్సీపట్నం వ్యూ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

నర్సీపట్నం.. వాణిజ్య సేవలకు ప్రసిద్ధి. మన్య ప్రాంత ముఖద్వారం. బ్రిటీష్ కాలం నుంచీ ఏజెన్సీ ఉత్పత్తులకు ఆలవాలం. దాదాపు 10 మండలాల ప్రజలకు అన్ని రకాల అవసరాలు తీర్చే ప్రముఖ ప్రాంతం. నేడు విద్య, వైద్య పరంగానూ దూసుకుపోతోంది. తాండవ, వరహా నదుల వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఆహార, వాణిజ్య పంటలు పుష్కలంగా సాగవుతున్నాయి. ఖనిజ నిక్షేపాలకు నిలయంగా ఉంది. మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం అనకాపల్లి జిల్లాలో ప్రధాన ప్రాంతం.

అల్లూరి జిల్లాలోని చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు మండలాల్లో గిరిజనులు పండించే మిరియాలు కాఫీ, పసుపు, అల్లం, అపరాలు, మొక్కజొన్న, ఇతర అటవీ ఉత్పత్తులు ముందుగా నర్సీపట్నం చేరుకుంటాయి. వ్యాపారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేసి ఉత్పత్తులను నర్సీపట్నంలో గ్రేడింగ్ చేసి, శుద్ధి చేసి ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్టు చేస్తుంటారు. అవకాశాన్ని బట్టి గోదాముల్లో నిల్వ ఉంచి గిరాకీ సమయంలో అమ్మకాలు చేస్తుంటారు. అలాగే నాణ్యమైన వృక్షాలు ఏజెన్సీలో ఉండడంతో కలప వ్యాపారం కూడా ఇక్కడ నుండి జోరుగా సాగుతుంది. రంగురాళ్ళ, ఏజెన్సీలో పండే గంజాయి వంటి అక్రమ వ్యాపారాలు కూడా నర్సీపట్నం కేంద్రంగా సాగుతూ ఉంటాయి. అలాగే అనకాపల్లి జిల్లాలోని గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాలు జీడితోటలకు ప్రసిద్ధి. ఇక్కడ జీడిపిక్కల ఫ్యాక్టరీలు సైతం ఉన్నాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో తాండవ, వరహా నదులు ప్రవహిస్తున్నాయి. వీటి ఆధారంగా ఉన్న రిజర్వాయర్ల ద్వారా వ్యవసాయానికి నీరు అందుతోంది.

నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, మాకవరపాలెంతో పాటు పక్క నియోజకవర్గాలకు చెందిన రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, ఏజెన్సీలోని చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు తదితర 10 మండలాలకు ముఖ్య కేంద్రంగా నర్సీపట్నం ఉంది. ఈ మండలాల ప్రజలకు ప్రతి చిన్న అవసరానికి నర్సీపట్నమే వస్తుంటారు. దీంతో నర్సీపట్నంలో అనేక వ్యాపార సంస్థలు, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ పెరుగుతూ ఉన్నాయి. మరోపక్క ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు పేద విద్యార్థులకు ఇక్కడ విద్యనందిస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు సైతం పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రోగులకు భరోసానిస్తోంది.

ఆంధ్ర ఊటీగా పిలవబడే లంబసింగి వెళ్లాలంటే పర్యాటకులు నర్సీపట్నం చేరుకోవాల్సిందే. ఇక్కడి నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణిస్తే లంబసింగి చేరుకోవచ్చు. అక్టోబర్ నెల నుంచి ఫిబ్రవరి వరకూ పర్యాటకుల తాకిడి నర్సీపట్నంలో ఎక్కువగా ఉంటుంది. లంబసింగిలో సరైన వసతులు లేకపోవడం, స్థల సమస్య ఉండడంతో నర్సీపట్నంలోని లాడ్జీలు, హోటళ్లు నిత్యం కిటకిటలాడుతుంటాయి.

రెవెన్యూ డివిజనల్ కేంద్రం కావడంతో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు నిలయంగా నర్సీపట్నం ఉంది. ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేటతో సహా పది మండలాల ప్రజలు అధికారిక పనుల నిమిత్తం నర్సీపట్నం వస్తుంటారు. దీంతో నిత్యం పట్టణం జనంతో కళకళలాడుతూ ఉంటుంది.

నక్కపల్లి ప్రభుత్వాసుపత్రి స్థాయిని పెంచి

వైద్యసేవలు మెరుగుపరచాలి

- వంద పడకల స్థాయి, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు

రాష్ట్ర హోం మంత్రి అనిత హామీల అమలుపైనే ఆశలు



నక్కపల్లిలోని 50 పడకల ప్రభుత్వాసుపత్రి

ప్రజాశక్తి- నక్కపల్లి : రానున్న రోజుల్లో పారిశ్రామికంగా పురోభివృద్ధి సాధించనున్న నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి రోగుల తాకిడి దృష్ట్యా దీని స్థాయిని పెంచడంతోపాటు సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి ఎప్పుడు రోగుల తాకిడి అధికంగానే ఉంటోంది. నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలు వైద్యం కోసం నక్కపల్లి ఆసుపత్రికి వస్తారు. ప్రతి రోజూ సగటున 500 నుండి 550 వరకు అవుట్ పేషెంట్స్ ఈ ఆసుపత్రిలో సేవలకు వస్తుంటారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, గైనిక్ వంటి స్పెషలిస్ట్ వైద్యసేవలతోపాటు పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య పరికరాలు ఉండడంతో గతంతో పోలిస్తే రోగులకు కాస్త మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయనే చెప్పాలి. .

గతంలో రోజుకు 300 నుండి 350 వరకు మాత్రమే ఓపి ఉండగా, 50 పడకల ఆసుపత్రి గా స్థాయి పెంచడంతో



నవజాత శిశువులకు వైద్యసేవలను పరిశీలిస్తున్న మంత్రి



ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభం

ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో పాటు పాయకరావుపేట జాతీయ రహదారి నుండి ఎస్ రాయవరం మండలం, పెనుగొల్లు జాతీయ రహదారి వరకు సుమారుగా 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. స్థానిక ఆసుపత్రి అందుబాటులో ఉండడంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుంటారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ వారికి ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రమాదంలో పరిస్థితి విషమంగా ఉన్నవారిని, రక్తం అవసరమైన వారికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి లేదా విశాఖ కేజీహెచ్ రిఫరల్ చేస్తున్నారు. ముఖ్యంగా నక్కపల్లి ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ లేకపోవడం వల్ల రిఫరల్ చేయాల్సి వస్తుంది.

ఇటీవల రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత రూ. 65.70 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నిధులు రూ.17.50 లక్షల వ్యయంతో ఎక్స్ రే ప్లాంట్, 18 .50 లక్షల వ్యయంతో సిఆర్మ్ మిషన్, డెక్కన్ కెమికల్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.10.50 లక్షల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్, హెటిరో డ్రగ్స్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూ. 12.20 లక్షల విలువైన వైద్య పరికరాలు, రూ.7 లక్షల వ్యయంతో ఆసుపత్రి పెయింటింగ్ వర్క్స్ సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను, తరచూ రోడ్డు ప్రమాద కేసులు సంఖ్యను దృష్టిలో పెట్టుకొని నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగాను, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో, అది సాకారమైతే ఇక్కడ వైద్యసేవలు మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

నక్కపల్లి 30 పడకల ఆసుపత్రిని 50 పడకల స్థాయికి అప్ గ్రేడ్ చేస్తూ, రూ. 3 కోట్ల నిధులతో భవన నిర్మాణ సముదాయాలను 2013 నవంబర్ 16న అప్పటి అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు వెంకట సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. హెటిరో కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూ.కోటితో ఆసుపత్రి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మొదటి విడతలో రూ.40 లక్షల వ్యయంతో అల్ట్రా సౌండ్ స్కానర్, ఎనస్థీషియా వర్క్ స్టేషన్, బయో మెడికల్ రూమ్, ఆర్ఒ ప్లాంట్‌లను సమకూర్చారు.

రానున్న కాలంలో ఈ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా మారనున్న నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజానికానికి మెరుగైన వైద్య సేవలతోపాటు, రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు సకాలంలో పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు నక్కపల్లిలో 100 పడకల ఆసుపత్రి, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది.

ఉపమాక తీర్థంలో

మసాలా ఘుమఘుమలు!



మసాలా దినుసులు కొనుగోలు చేస్తున్న జనం

- వెంకన్న వార్షిక కల్యాణోత్సవంలో ఇదే ప్రత్యేకం
- ఏటా ఆనవాయితీగా అమ్మకాలు.. భారీగా వచ్చే జనాలు

ప్రజాశక్తి-నక్కపల్లి : అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలంలో ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా జరుగు తీర్థంలో మసాలా దినుసులు వ్యాపారం ప్రత్యేకం .ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి స్వామివారి కల్యాణోత్సవాలు 20 రోజుల పాటు జరుగుతాయి. ఏటా స్వామి ఉత్సవాలు సందర్భంగా కొత్త అమావాస్య ముందు రోజు వరకు తీర్థం జరుగుతుంది. తీర్థంలో మసాలా దినుసులు, పిల్లల ఆట వస్తువులు, గహోపకర సామాగ్రి, గాజులు, ఫ్యాన్సీ పావులతో పాటు తినుబండరాలకు సంబంధించి తోపుడు బండ్లపై ఖర్జూరం, శనగపప్పు, ద్రాక్ష వంటివి విక్రయిస్తారు.

తీర్థంలో మసాలా దినుసులు వ్యాపారం ప్రత్యేకం. పసుపు, కుంకుమ, జీల కర్ర, ధనియాలు, యాలకలు, దాల్చిన చెక్క, లవంగాలు, గసగసాలు, అవాలు, ఫలావు సామగ్రి, వెల్లుల్లి, ఎండు మిర్చి తదితర సుగంధ ద్రవ్యాలను వ్యాపారులు విక్రయిస్తుటారు. వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులు తీర్థానికి తరలివచ్చి, తాత్కాలికంగా కమ్మలతో షాపులు ఏర్పాటు చేసుకుని సుగంధ ద్రవ్యాలు విక్రయిస్తుంటారు. 20 వరకు షాపుల తీర్థంలో వెలుస్తాయి. ఉమ్మడి విశాఖ ఏజెన్సీ ప్రాంతంతో పాటు, ఉత్తరాంధ్ర, కాకినాడ జిల్లాల్లో పలు గ్రామాల నుంచి జనం తరలివచ్చి స్వామిని దర్శించుకుని, ఏడాదికి సరిపడే మసాల దినుసులు కొనుగోలు చేసుకుని తీసుకెళ్లడం ఆనవాయితీగా సాగుతోంది.



జనం రద్దీతో కిటకిటలాడుతున్న షాపుల ప్రాంగణం

పాయకరావుపేట నియోజకవర్గంలోని మండలాలతో పాటు నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి, చోడవరం తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఆటోలు, ఇతర వాహనాల్లో ఉపమాక తీర్థానికి తరలివచ్చి మసాలా దినుసులు కొనుగోలు చేసుకుని పెద్ద పెద్ద మూటలతో తీసుకువెళ్తుంటారు. చాలా మంది భక్తులు సెంటిమెంట్ గా భావించి ఏటా ఉపమాక లో జరిగే తీర్థంలో మసాలా దినుసులు తప్పనిసరిగా కొనుక్కొని ఇళ్లకు తీసుకెళుతుంటారు. రకరకాల మసాలా దినుసులన్నీ ఒకే చోట లభించడంతో ఎక్కువమంది వీటి కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. దీంతో ఉపమాకలో సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసులు ఘుమఘుమలాడుతుంటాయి. 20రోజులపాటు నిర్వహించే జాతరలోనే కోట్లాది రూపాయల మసాలా దినుసుల వ్యాపారం సాగుతుందంటే, దీనికి ఎంత ప్రత్యేకత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు..

రెండు జిల్లాల జీవనాడి తాండవ జలాశయం



తాండవ రిజర్వాయర్

ప్రజాశక్తి-కోటవురట్ల

తాండవ జలాశయం అనకాపల్లి, కాకినాడ రెండు జిల్లాలకు జీవనడిగా నిలుస్తుంది. 380 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన తాండవ జలాశయానికి రైట్ కెనాల్ 15.5 కిలోమీటర్లు, లెఫ్ట్ కెనాల్ 19.77 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ ఛానల్స్ ద్వారా నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాలకు సాగునీటిని అందిస్తుంది. నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, మండలాలకు 32,689 ఎకరాలు ఆయకట్టు ఉండగా, తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో 18776 ఎకరాలకు వివిధ పంటలకు సాగునీరు అందిస్తుంది. ఈ జలశయంపై 20 వరకు నీటి సంఘాలు ఉన్నాయి. దాదాపు రెండు చానల్స్‌కి కూడా సిమెంట్ లైనింగ్ వేయడంతో సాగునీరు పుష్కలంగా అందుతుంది. మిగులు నీరు తాండవ నదికి మళ్లిస్తారు. తాండవ డ్యామ్ నిర్మాణం చేపట్టకు ముందు కేవలం వర్షాధారంపై ఆధారపడి జీవించేవారు. తాండవ నిర్మాణం చేపట్టిన తర్వాత ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌కు సాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నీరు సరఫరా అవుతూ ఉండడంతో ఆ ప్రాంతం సస్యశ్యామలంగా విరాజిల్లుతుంది. దాదాపుగా అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో వరి సాగు చేస్తూ ఉండడమే కాకుండా ఈ ప్రాంతంలో పండిన వరికి ప్రత్యేక డిమాండ్ కూడా ఉంటుంది. ప్రధాన పంట వరి కాగా జీడి, మామిడి, సరుకుడు కూడా విస్తారంగా సాగు చేస్తూ ఉంటారు. ఇటీవల కాలంలో నాలుగు కోట్ల రూపాయలతో తాండవ రిజర్వాయర్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 57 వర్కులు మంజూరు దాకా 32 వరకు పూర్తి చేసినట్లు డివిజనల్ ఇంజనీర్ అనురాధ వెల్లడించారు, తాండవ జలాశయంలో చేపల పట్టే మత్స్యకారులు కుటుంబాలు దాదాపు 200 వరకు ఉంటాయి. వీరంతా ఈ జలాశయంపైనే ఆధారపడి జీవిస్తూ ఉంటారు. ఈ ప్రాంతంలో పండే చేపలు మంచి రుచిగా ఉండడంతో డిమాండ్ కూడా అధికంగా ఉంటుంది. ఎటువంటి రసాయనాలు వాడుకుంటా పెరిగిన చేపలు కావడంతో నర్సీపట్నం, తుని పరిసర ప్రాంతాలకు సరఫరా చేస్తూ ఉంటారు.



సాగునీరు అందించే కెనాల్

ఉత్తర వాహినిగా ప్రసిద్ధి బలిఘట్టం



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

నర్సీపట్నం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆ తర్వాత వినిపించేది ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన బలిఘట్టం ప్రాంతం. బలిఘట్టం ఉత్తవాహని ఆధ్యాత్మిక కేంద్రంగా భక్తులు నమ్ముతుంటారు. ఇక్కడ వరాహ నది ఉత్తరానికి ప్రవహిస్తూ ఉత్తర వాహినిగా పేరుగాంచి పుణ్య నదిగా మారింది. ఈ తీరం చుట్టూ పర్వత శ్రేణులు ఆపై దేవతామూర్తుల దేవాలయాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలానికి చెందిన బలిఘట్టం గ్రామానికి పురాణాల్లోనూ స్థానం ఉంది. ఇక్కడ బ్రహ్మచే ప్రతిష్ఠింపబడిన శివలింగం బ్రహ్మ లింగేశ్వరస్వామిగా పిలుస్తారు. లోక కల్యాణార్ధం తలపెట్టిన యజ్ఞానికి శివారాధన నిమిత్తం బలిచక్రవర్తి బ్రహ్మను ప్రార్ధించి శివలింగాన్ని భూవికి రప్పించారు. ఈ సంఘటనతో ఈ ప్రాంతానికి చరిత్రలో స్థానం లభించింది. వామనవతారంలో మహావిష్ణువు బలి చక్రవర్తిని ఘట్టం చేసినటువంటి ప్రాంతం ఈ బలిఘట్టం అందుకే ఈ ప్రాంతం బలి ఘట్టంగా పేరు గాంచింది.

ఈ తీరమందు ఆధ్యాత్మిక యోగి పాకలపాడు గురుదేవుల ఆశ్రమం, రాజరాజేశ్వరీ సమేత బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం, రమా సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయం, 600 అడుగుల ఎత్తు గల పర్వతంపై భగవాన్ శ్రీస్వామి చిద్గదానంద సాధువు మఠం, నిత్యం ఆధ్యాత్మిక భక్తిభావాలతో పూజలందుకుంటూ విరాజిల్లు తున్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీలో ఉన్న ఈ బలిఘట్టానికి మరో కాశీగా పేరు.

అటవీ ప్రాంతంలో పుట్టిన సెలయేర్లు వరాహ నదిగా ప్రవహిస్తూ ఇక్కడకు చేరడంతో ఈ వరాహ నదిలో కార్తీక మాసం, శివరాత్రి సమయంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారు. పితృదేవతలకు తర్పణాలు వదలడం, పిండ ప్రదానాలు వంటి కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయి. పాకలపాడు గురుదేవులుగా పిలవబడుతున్న దామరాజు వెంకటరామ యోగీంద్రులు శివైక్యం చెందిన తర్వాత ఈ ఉత్తర వాహిని తీరంలోనే గురుదేవులు సమాధి ఏర్పాటు చేశారు. అప్పటి నుండి ఇక్కడ ఎన్నో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్తర వాహిని వంటి అరుదైన నదీ ప్రవాహం ఇక్కడ మాత్రమే ఉంది.

హిందూ మహారాజు శివునికి నిత్యం పూజలు చేసేవాడని, ఒక సందర్భంలో శివార్చనకు నీరు లేక పోవడంతో విష్ణుమూర్తి కోసం తపస్సు చేయగా వరాహావతారంలో దర్శనం ఇచ్చిన ఆయన నీటిని సమకూర్చడంతో ఈ ప్రాంతంలో ప్రవహించే నదికి వరాహానది అని పేరు వచ్చింది. ఈ నది ఉత్తర దిక్కుగా ప్రవహించడంతో.. ఉత్తరవాహినిగా చరిత్రలో నిలిచింది. బ్రహ్మచే ప్రతిష్ఠింపబడిన ఈ శివలింగానికి ఏటా మహాశివరాత్రి పర్వదినాన పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

జిల్లాలోని దూర ప్రాంతాల నుండి సైతం వేల సంఖ్యలో భక్తులు బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పునీతులవుతారు. ఉత్తర వాహినిలో స్నానం ఆచరించడం సర్వ పాప పరిహారంగా భక్తులు భావిస్తారు. బ్రహ్మలింగేశ్వరస్వామి అలయం పూర్తిగా రాతితోనే నిర్మితమైంది. ఇక్కడ స్తంభాలు, పైకప్పులు సైతం రాతితోనే నిర్మించారు. వేల సంవత్సరాల క్రితమే ఈ దేవాలయం పూర్తి స్థాయిలో నిర్మితమైనట్లు స్థానికులు చెబుతుంటారు. కొండ శిఖరంపై నిర్మించబడిన స్వామి చిద్గదానంద వారి ఆశ్రమంలో ధ్యానంలో కొందరు సాధువులు ఇక్కడికి వచ్చి ఉంటారు. ఇదే కాకుండా మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం నవగ్రహ మండపం దత్తాత్రేయ ఆశ్రమం ఇలా ఎన్నో దేవాలయాలు ప్రతిష్ఠించబడ్డాయి. ఇక్కడికి వచ్చినటువంటి భక్తులకు సౌకర్యార్థం వసతి గృహాలు మౌలిక సదుపాయాలు ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఉత్తర వాహిని తీరమందు స్నాన ఘాటులు ఏర్పాటు చేసి భక్తులకు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా సదుపాయాలు కల్పించారు.



అపార జలవనరులు.. మన సొంతం

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : అపారమైన జలవనరులు, వాటికి తగ్గట్టు రిజర్వాయర్లు అనకాపల్లి జిల్లా సొంతం మాడుగుల నియోజకవర్గంలో ఇవి ఎక్కువుగా ఉన్నాయి. గతంలో పెద్ద సంఖ్యలో రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న గ్రామీణ ప్రాంతంలో పంటపొలాలు సస్యశ్యామలం కావడానికి ఈ రిజర్వాయర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పలు రిజర్వాయర్లు పూర్తి కాకుండా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా, మేజర్ ప్రాజక్టుల కారణంగా వేలాది ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందుతోంది.

వారాడ నారాయణమూర్తి జలాశయం

దేవరాపల్లి మండలం రైవాడ వద్ద నిర్మించిన వారాడ నారాయణమూర్తి జలాశయం ద్వారా సుమారు 22 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం మండలాలతో పాటు, విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తోంది. విశాఖ ప్రజల దాహార్తిని తీరుస్తోంది. అప్పట్లో ఈ రిజర్వాయరు నిర్మాణానికి సుమారు రూ.22 కోట్లు ఖర్చు అయ్యాయి.

తెన్నేటి విశ్వనాథం జలాశయం

మాడుగుల మండలం రావిపాలెం వద్ద నిర్మించిన తెన్నేటి విశ్వనాథం జలాశయం ద్వారా మాడుగుల, బుచ్చయ్యపేట, రావికమతం మండలాల్లో 19 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. రిజర్వాయరు నిర్మాణం కాక మునుపు ఈ పరిధిలోని పంట భూములు కేవలం వర్షాధారంపైనే ఆధారపడి ఉండేవి. దీంతో రైతులు వ్యవసాయం పట్ల అంతగా ఆసక్తి చూపేవారు కాదు. నేడు జలాశయం కారణంగా ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం కలిగింది. ఈ రిజర్వాయరుకు ఆమడ దూరంలో ఉన్న పలు గ్రామాలకు మాత్రం సాగు నీరు అందడం లేదు.

వేచలపు పాలవెల్లి జలాశయం

చీడికాడ మండలం కోణాం వద్ద నిర్మించిన వేచలపు పాలవెల్లి జలాశయం ద్వారా చీడికాడ, మాడుగుల, బుచ్చయ్యపేట, చోడవరం, దేవరాపల్లి మండలాలకు చెందిన సుమారు 14 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. 1977లో రిజర్వాయరు నిర్మాణ పనులు ప్రారంభం కాగా 1980లో పూర్తయ్యాయి.

తారకరామ జలాశయం

మాడుగుల మండలం తాటిపర్తి వద్ద నిర్మించిన తారకరామ (తాచేరు) రిజర్వాయరు ద్వారా సుమారు 4 వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. పలు కారణాలతో ఆ లక్ష్యం నెరవేరడం లేదు. మాడుగుల మండలంలో పాలగెడ్డ, ఉరకగెడ్డ, గొర్రిగెడ్డ రిజర్వాయర్లు ఉన్నాయి. ఇవి కూడా అసంపూర్తిగానే మిగిలాయి. ఇవన్నీ పూర్తయితే చాలా గ్రామాలకు సాగునీరందే అవకాశముంది.



తెన్నేటి విశ్వనాథం (పెద్దేరు) జలాశయం



కల్యాణపులోవ రిజర్వాయర్



రైవాడ రిజర్వాయర్

ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక





1. ఉపమాక దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు
2. ఉపమాక వెంకటేశ్వరస్వామి దేవస్థానం

ప్రజాశక్తి-నక్కపల్లి : ఎన్నో విశిష్టతలను సంతరించుకుని భక్తులు, పర్యాటకులను అమితంగా ఆకరిస్తొన్న ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకటేశ్వరస్వామి దేవస్థానం. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, ఉపమాక గ్రామంలో వేంచేసియున్న వెంకన్న దేవాలయానికి సుమారుగా 1,500 శతబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడ ఆధ్యాత్మిక ప్రశాంతతే కాకుండా ప్రకృతి రమణీయత మనసును ఆహ్లాద పరుచుతుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్యమైన దైవంగా ఉపమాక వెంకన్నను చెప్పవచ్చు. ప్రతి రోజూ తిరుపతిలో జరిగే విధంగానే ఇక్కడ కూడా పూజలు చేస్తారు.

స్థల పురాణ విశేషాలు

క్రీస్తు శకం ఆరో శతాబ్ధంలో ఇక్కడ వెంకటేశ్వర స్వామి క్షేత్రం వెలసినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తొంది. ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై స్వామి స్వయంగా వెలిసియున్నారు. అందుచేతనే కొండపై వెంకటేశ్వరస్వామి స్వయంగా ఏకశిలపై అశ్వరూఢుడై (గుర్రంపై కూర్చుండునట్లు) భక్తులకు దర్శనమిస్తారు. ఈ క్షేత్రానికి సంబంధించి ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. గరుత్మంతుడు ఎల్లవేళలా తన వీపుపై స్వామి కూర్చుండునట్లు వరం కోరగా దక్షిణ సముద్రతీరం నందు నీవు కొండగా అవిర్భవించియుండగా తిరుపతి నుంచి వచ్చి నీపై స్వయంగా భక్తులతో పూజలు అందుకుంటానని విష్ణుమూర్తి వరం ఇచ్చినట్లు చెబుతారు. ఈ రీత్యా ఉపమాక క్షేత్రంలోని గరుడాద్రిపై స్వామి వారు ఇంద్రనీలశిలపై వెలిశారని స్థల పురాణంలో ఉంది. అందువల్లే ఈ కొండకు గరుడాచలం అనే పేరు వచ్చిందని నానుడి. రుషులు మోక్షం కోసం శ్రీమన్నారాయణుడిని వరం కోరగా, ఉపమాక వనంలో వారు మృగంగా జన్మించినప్పుడు తాను వేటకు వచ్చి సంహరించి మోక్షం ఇస్తానని చెప్పినట్లు కూడా ఈ పురాణం చెబుతుంది. ఈ తరువాత వేట కోసం అశ్వరూఢై వచ్చిన విష్ణుమూర్తి లక్ష్మి సమేతంగా ఇక్కడ వెలిసినట్లు చెబుతారు. ఈ కారణంగానే ఇక్కడ గరుడాద్రి పర్వతంపై శాలిగ్రామశిలపై గుర్రంపై స్వామి కూర్చుని ఉండినట్లు దర్శనమిస్తారు. గరుడ పర్వతం దిగువ భాగాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాలస్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు నిత్యం భక్తులకు దర్శనమిస్తాయి. ఈ క్షేత్రంలో స్వామి వారు ఉత్తర ముఖంగా వెలసి ఉండటంతో అన్ని దేవాలయాల్లో సంవత్సరానికి ఒక్క రోజు లభించు ఉత్తర ద్వార దర్శనం ఇక్కడ మాత్రం భక్తులకు నిత్యమూ లభిస్తోంది.

కన్నుల పండువగా ఉత్సవాలు

వెంకన్న ఆలయంలో జరిగే ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తుంటారు. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ ఏకాదశినాడు వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. కల్యాణం తిలకించి, స్వామి కృపకుపాత్రులవుతారు. కల్యాణోత్సవాలను పురష్కరించుకుని 5 రోజుల పాటు ఆలయంలో ప్రతేక పూజా కార్యక్రమాలు, స్వామి వారి తిరువీధి సేవలు నిర్వహిస్తారు. కల్యాణం రోజున శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు సంపూర్ణ స్వర్ణాలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. కల్యాణోత్సవాలు సందర్భంగా 20 రోజుల పాటు తీర్థం జరుగుతుంది. కల్యాణోత్సవాలతో పాటు బ్రహ్మోత్సవాలు, ధనుర్మాసోత్సవాలు, ప్రత్యేక పూజలు, నిరంతరం వేద పారాయణం ఇక్కడ జరుగుతుంటాయి.

దేవాలయం అభివృద్ధికి టిటిడిలో విలీనం

దేవదాయశాఖలో ఉన్న ఈ క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు టిటిడిలో విలీనం చేశారు. 2015 నవంబర్ 18న ఈ పుణ్యక్షేత్రాన్ని అధికారంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేసుకుంది. అప్పటి నుంచి ఆలయంలో జరుగు కార్యక్రమాలు టిటిడి నిబంధనల మేరకు జరుగుతున్నాయి.

ప్రశాంతమైన వాతావరణం

ఆధ్యాత్మిక కేంద్రమైన ఉపమాకలో అడుగుపెడితే మానసిక ప్రశాంతతో ప్రత్యేకమైన అనుభూతి లభిస్తుంది. నక్కపల్లి జాతీయరహదారిని నుంచి కిలోమీటర్ దూరంలో ఉపమాక దర్శనమిస్తుంది. కాలినడకన, లేక వాహనంలో చేరుకోవచ్చును. కాలినడకన వచ్చే వారికి చెప్పలేని అనుభూతి కలుగుతుంది. పచ్చదనం ప్రతిబింబించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో ఎత్తయిన పర్వతం, పర్వతంపై స్వామి గోపురం దర్శనమిస్తాయి. దారిపొడువునా రెండు చెరువుల అందాలు, చుట్టూ పచ్చిక బయళ్లు, కొబ్బరి తోటలు కనువిందు చేస్తాయి. ఆలయంలో సుందరమైన బేడా మండపం, గాలిగోపురం, పురాతనమైన ఇత్తర కట్టడాలు శిల్పకళా నైపుణ్యాన్ని చాటిచెబుతాయి. వెంకన్నను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు చెరువు వద్ద ఉన్న లక్ష్మణేశ్వర స్వామి, కామాక్షి, దుర్గా భవానీ అమ్మవార్లను దర్శించుకుంటారు. ఉపమాక గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో రాజయ్యపేట సముద్రతీరం ఉంది. పిక్నిక్‌కు వచ్చిన పర్యాటకులు సముద్రతీరంలో స్నానాలు ఆచరించి వెంకన్నను దర్శించుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించి ఆనందం పొందుతారు.

స్ఫూర్తి కేంద్రం..అల్లూరి పార్కు



అల్లూరి పార్కు ముఖద్వారం


ప్రజాశక్తి-గొలుగొండ : బ్రిటీషు దొరల పాలనను వ్యతిరేకించి, దేశస్వాతంత్ర్యం కోసం మన్యం విప్లవాన్ని నడిపించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. అల్లూరి అసలు పేరు శ్రీరామరాజు అయితే పోలీసుల ఫిర్యాదులలో ఆంగ్లేయుల చేతిరాత కారణంగా శ్రీరామరాజు బదులుగా సీతారామరాజుగా మార్పు చెందింది. విశాఖజిల్లా పద్మనాభ మండలంలో 1897 జూలై 4న జన్మించిన అల్లూరి, తూర్పుగోదావరి జిల్లాలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన విశాఖజిల్లా కృష్ణదేవిపేట ప్రాంతానికి వచ్చారు. అక్కడ గిరిజనులను బానిసలుగా చూస్తూ మోసం చేస్తున్న ఆంగ్లేయుల అకృత్యాలను సహించలేక మన్యం విప్లవాన్ని ప్రారంభించాడు. 1922లో ప్రారంభమైన అల్లూరి విప్లవం 1924 మే 7న ఆయనను బంధించి ఆంగ్లేయులు కాల్చి చంపడంతో ముగిసింది. మన్యం విప్లవం నడిచిన రెండేళ్ల కాలంలో అల్లూరి పేరంటే తెల్లదొరలు గుండెలో రైళ్ళు పరిగెత్తేవి. విప్లవ సమయంలో ఆయన వరుసగా 1922 ఆగస్టు 22న చింతపల్లి, 23న కృష్ణదేవిపేట 26న రాజవొమ్మంగి, 27న అన్నవరం, అడ్డతీగల, రంపచోడవరం పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుదాలను స్వాధీనం చేసుకున్నాడు. దీంతో బెంబేలెత్తిన తెల్లదొరలు అల్లూరిని పట్టుకోవడానికి ఎన్నో పథకాలు వేసి విఫలమై చివరకు 1924 మే 7న మంప సమీపంలో స్నానం చేస్తుండగా దొంగచాటుగా పట్టుకున్నారు. అక్కడ నుంచి రాజేంద్రపాలెం తీసుకువచ్చి మేజర్ గుడాల్ తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం గిరిజనులు గుర్తించడానికి కృష్ణదేవిపేటకు అల్లూరి మృతదేహాన్ని తీసుకువచ్చి సమాధి చేశారు.

మన్యం విప్లవం సారధ్యం వహించి చారిత్రకంగా పేరు తెచ్చిన విప్లవ వీరుడు

-పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

అల్లూరి నడయాడిన ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని పాలకులు అధికారులు తొలుత ప్రకటనలకే పరిమితమవుతున్నారు. 2003లో అప్పటి టిడిపి ప్రభుత్వం పర్యాటకశాఖను ఒప్పించడంతో అల్లూరి నడయాడిన ప్రాంతాలను దేశం మొత్తానికి తెలిసేలా అభివృద్ధి చేస్తామని రూ.3.60 కోట్లతో కొన్ని ప్రతిపాదనలు చేసి మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఆ సొమ్ముతో అల్లూరి సమాదులున్న పార్కులో పర్యాటకులు విశ్రాంతి కోసం కాటేజీల ఏర్పాటు, సమాధులు ఆధునీకరణ, సమాధుల వద్ద నిత్యం వెలిగేలా అఖండ జ్యోతి ఏర్పాటు, పార్కులో అల్లూరి భారీ విగ్రహం, అల్లూరి చరిత్ర తెలిసేలా చిత్రపటాలుతో మ్యూజియం ఏర్పాటు, గ్రంథాలయం, అల్లూరి స్నానం చేసి పూజలు నిర్వహించే గాదిగుమ్మి జలపాతం కాటేజీలు ఏర్పాటు





సమాధులు



సుందరంగా పార్కు

చేస్తామన్నారు. ఇందుకు అనుగుణంగా 23 లక్షల రూపాయులతో అల్లూరి, మా ఆదునీకరించి, వాటి చుట్టూ ఆకర్షించే పూలమొక్కలు, పలు రకాలచెటును పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పార్కులో టైల్స్ అమర్చారు. అప్పట్లో ప్రభుత్వం మారిపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ.90 లక్షల రూపాయులతో పార్కులో పర్యాటకులు సేద తీరేందుకు ఆకర్షణీయమైన పాకలు ఏర్పాటు, విశ్రాంతి తీసుకునే సిమ్మెంటు బల్లలు. మినీ ధియేటర్ ఏర్పాటు చేశ్మారు. అందులో ప్రాజెక్టరు ఏర్పాటు, అలాగే గాదిగుమ్మి జలపాతం వద్ద పర్యాటకులు సేదతీరేందుకు షెడ్ల ఏర్పాటు జరిగింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పార్కు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వం అల్లూరి జయంతిని అధికారికంగా నిర్వహించడాన్ని నిర్ణయించింది. ఇందులో భాగంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లూరు ఎంపిలు చెరో రూ.10లక్షల చొప్పున రూ.20లక్షలు మంజూరు చేయడం జరిగింది. రూ.కోటి వరకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ రూ.20లక్షల నిధులతో పార్కు అభివృద్ధి, ఆధునీకరమైన లైట్లు, మ్యూజియం ఆధునీకరణ, సమాధుల ఆధునీకరణ, పెయింటింగ్ వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం అల్లూరి పార్కు అభివృద్ధి పదంలో ముందుకు వెళుతుంది. అలాగే టూరిజం హబ్‌లో భాగంగా రాజమండ్రి నుంచి అరకు వరకు హైవే వేయడంతో అల్లూరి పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది.

ప్రభుత్వ కార్యాలయాలకు నిలయం..నర్సీపట్నం



ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం పలు ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగా మారింది. పట్టణంలో చారిత్రకంగా, భౌగోళికంగా, మౌలిక వసతుల పరంగా జిల్లా కేంద్రాన్ని తలదన్నేలా కట్టడాలు, భవనాలు ఉన్నాయి. విశాలమైన ప్రభుత్వ స్థలాలు, కార్యాలయ భవనాలు, రవాణా సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉండటం నర్సీపట్నం ప్రత్యేకత. ప్రస్తుతం పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం రోడ్లు భవనాల శాఖ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇవి జిల్లా స్థాయి ప్రధాన కార్యాలయాలుగా విస్తరించేందుకు అనువుగా ఉంటాయని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా బ్రిటిష్ కాలం నాటి భవనాలు, స్వాతంత్ర్య పోరాట ఉద్యమాలకు నర్సీపట్నం కేంద్రంగా నిలిచింది. ఇవి ఈ ప్రాంత ప్రాముఖ్యతను మరింతగా చూపిస్తున్నాయి. ఇక్కడా జిల్లా స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేస్తే పట్టణంలో మౌలిక వసతులు మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్య, వైద్యం,రవాణా, వాణిజ్యం రంగాలలో



తహశీల్దార్ కార్యాలయం



సబ్ కలెక్టర్ కార్యాలయం

కూడా వద్ధి సాధ్యమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఐటిడిఏను ఏర్పాటు చేస్తే జిల్లా పరిపాలనా వ్యవస్థకు అవసరమైన స్థలాలు, భవనాలు ఇప్పటికే సిద్ధంగా ఉండటమే కాకుండా, నర్సీపట్నం భౌగోళికంగా కూడా అనేక మండలాలకు సమీపంగా ఉండటం వల్ల పరిపాలనా సౌలభ్యం కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.పల్లెల నుండి పట్టణానికి వచ్చే రైతులు, ఇక్కడి మార్కెట్, రహదారి సౌకర్యాలు వంటివి నర్సీపట్నం వంటివి అభివృద్ధి చెందుతున్నాయి.

సినీరంగంలో నర్సీపట్నం వాసులు

ప్రజాశక్తి - నర్సీపట్నం

సినీ రంగంలో నర్సీపట్నం వాసులు రాణిస్తున్నారు. నర్సీపట్నం నుంచి ఎందరో డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, హాస్య నటులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు టాలీవుట్ ఇండస్ట్రీకి వెళ్లారు. ముందుగా నర్సీపట్నానికి చెందిన గుణశేఖర్ టాలీవుడ్‌లో అగ్రదర్శకుల్లో ఒకరుగా నిలిచారు. ఆయన 1992లో మురారీ సినిమా ద్వారా డైరెక్టర్‌గా తన సినీ ప్రస్తానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 1995లో సొగసు చూడతరమా, 1998లో మెగాస్టార్ చిరంజీవితో చూడాలని ఉంది సినిమా తీసి అందరిని ఆకట్టు కున్నారు. ఆ తర్వాత చిరంజీవితోనే మృగరాజు సినిమాకు డైరెక్టర్‌గా చేశారు. 2003లో మహేష్‌బాబు కేరీర్‌లో పునాదిగా నిలిచిన ఒక్కడు సినిమా అందించారు. ఒక్కడు తర్వాత అర్జున్, సైనికుడు, వరుడు, నిప్పు, రుద్రమదేవి సినిమాలను తీసి టాలీవుట్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు.


పూరీ జగన్నాథ్


గుణశేఖర్


పరశురామ్


సాయిరాం శంకర్


జోగినాయుడు

నర్సీపట్నం నుంచి వచ్చిన మరో అగ్రదర్శకుడు పూరి జగన్నాథ్. నర్సీపట్నానికి సమీపంలో ఉన్న కోటవురట్ల మండలం బాపిరాజుకొత్తపల్లి గ్రామానికి చెందిన ఆయన మొదట్లో హైదరాబాద్ వెళ్లి రామ్‌గోపాల్‌వర్మ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2000 సంవత్సరంలో పవన్‌కల్యాణ్‌తో బద్రీ, సినిమా తీశారు. బద్రీ చిత్రం ఆఖండ విజయం సాధించింది. తర్వాత జగపతిబాబుతో బాచీ, రవితేజతో ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం, మంత్రి అయ్యన్న పాత్రుడు నిర్మాతగా రవితేజతో ఈడియట్ సినిమా తీసి మంచి విజయం సాధించారు. మళ్లీ రవితేజతో అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి, నాగార్జునతో శివమణి తీసి మంచి పేరు సాధించారు. 2004లో జూనియర్ ఎన్‌టిఆర్‌తో ఆంధ్రవాలా తీశారు. ఇది పెద్దగా విజయం సాధించలేదు. అదే ఏడాదిలో తన తమ్ముడు సాయిరామ్‌శంకర్‌తో 143 అనే సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు. తర్వాత నాగార్జునతో సూపర్ సినిమా తీశాడు. 2006లో మహేష్‌బాబు పోకిరి, 2007లో అల్లు అర్జున్‌తో దేశముదురు, రామ్‌చరణ్‌తో మొదటి చిత్రం చిరుత సినిమాలు భారీ విజయం సాధించాయి. 2008లో బుజ్జిగాడు, నేనింతే, 2009లో ఏక్‌నిరంజన్, 2010లో గోలీమార్, 2011లో నేను నా రాక్షసి తీశారు. 2011లో బాలీవుడ్‌లో కూడా బిగ్‌బి అమితాబచ్చన్‌తో బుడ్డా హోగా తేరా బాప్ సినిమా తీసి బాలీవుడ్‌లో తన సత్తా చాటారు. 2012లో బిజినెస్‌మ్యాన్, దేవుడు చేసిన మనుషులు, కెమెరామన్ గంగతో రాంబాబు, 2013లో ఇద్దరమ్మాయిలతో, 2014లో హార్ట్‌ఎటాక్, 2015లో టెంపర్, జ్యోతిలక్ష్మి, లోఫర్, 2017లో రోగ్, పైసా వసూల్, 2018లో మెహబూబ్ సినిమాలకు దర్శకునిగా పని చేశారు.

మరో యువ దర్శకుడు పరశురామ్‌ది నర్సీపట్నం సమీపంలో చెర్లోపాలెం గ్రామం. నర్సీపట్నంలో ఆయన మెడికల్ ల్యాబ్ నిర్వహిస్తుండేవాడు. ఆయన పూరీజగన్నాథ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసి 2008లో నిఖిల్ హీరోగా యువత అనే సినిమాతో దర్శకుడిగా సత్తా చాటారు. ఆ తర్వాత 2009లో ఆంజనేయులు, 2011 నారా రోహిత్‌తో సోలో సినిమా తీసి పెద్ద విజయం సాధించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 2012లో సారొచ్చారు, 2016లో శ్రీరస్తు శుభమస్తు సినిమా తీశారు. ఆయన విజయదేవరకొండ హీరోగా గీత గోవిందం సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం మంచి విజయం సాధించింది. దీంతో పరశు రామ్‌కు మంచి పేరు వచ్చింది.

నర్సీపట్నానికి చెందిన వర్ధమాన దర్శకులు గోవిందవరహా (నాన్న నేను అబద్ధం), శ్రీరామ్‌బాలాజీ (మాయా మాల్)లు కూడా డైరెక్టర్లుగా నిరూపించుకున్నారు. షాలిని సినిమా దర్శకుడు షిరాజ్ కూడా ఈ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం. పూరీ జగన్నాథ్ సోదరుడు సాయిరామ్‌శంకర్ కూడా సినిమా హీరోగా స్థిర పడ్డారు. జోగి బ్రదర్‌లో ఒక్కరైన జోగినాయుడు ఇంద్రస్టీలో చిన్న చిన్న క్యారెక్టర్లు చేసుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. నర్సీపట్నానికి చెందిన పద్మిని, లక్ష్మిశ్రీలు, సైరాభానులు కూడా చిన్న చిన్న పాత్రల్లో సినిమా, టీవీ సీరియల్స్‌లో కనిపిస్తున్నారు. ఇటీవల చిన్న తనంలో సత్తా చాటుతున్న అమ్మనా కోడలు సీరియల్‌లో చైల్డ్ ఆర్టిస్ట్ విష్ణుప్రియ కూడా నర్సీపట్నానికి చెందిన వారే. ఇలా నర్సీపట్నానికి చెందిన వారు టాలీవుడ్ ఇండస్ట్రీలో తమ టాలెంట్‌ను నిరూపించు కుంటున్నారు.

లక్క బొమ్మలకు ప్రసిద్ధి కైలాసపట్నం



ప్రజాశక్తి-కోటవురట్ల

వయ్యారి లక్కబొమ్మలకు కైలాసపట్నం ప్రసిద్ధి చెందింది. కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం గ్రామంలో వివిధ కులాలకు చెందిన సుమారు 20 కుటుంబాలు ఈ అందాల లక్కబొమ్మలను తయారుచేస్తున్నారు. ఈ బొమ్మల తయారీయే వారి జీవనాధారం. లక్క బొమ్మల తయారీకి అంకుడు, బిల్ల, అల్లి, లోనిగ తదితర కలపను వాడతారు. దీనికి డిమాండు కూడా ఎక్కువే. అడవి నుంచి తెచ్చే ఈ కర్ర కొనుక్కోవడం, లక్క కరాచీ కాగితాలు, కరెంటు బిల్లులు ధరలు అధికమైపోతున్నాయని కళాకారులు చెబుతున్నారు. రోజూ కనీసం 14 గంటలు పనిచేసినా కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని వారు అంటున్నారు. ఒక్కప్పుడు మంచి ఆదరణ ఉన్న ఈ బొమ్మలకు నేడు విదేశీ, స్వదేశీ రబ్బరు బొమ్మల దిగుమతి, తయారీ వల్ల గిరాకీ తగ్గిపోయిందని వారు ఆవేదన వక్తం చేస్తున్నారు. ఇక్కడ తయారుచేసిన బొమ్మలు ఏటికొప్పాక తీసుకువెళ్లి అమ్ముతారు. ఎంతో గుర్తింపు ఉన్న ఏటికొప్పాక బొమ్మలు ఇక్కడి నుంచి కూడా తయారై వెళ్లడం తమకు ఎంతో ఆనందాన్నిస్తుందంటూరు తయారీదార్లు. కానీ గిట్టుబాటు లేక అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. అందమైన కళాఖండాలను తయారు చేసే ఈ కళాకారులపట్ల ప్రభుత్వాలు వివక్ష చూపిస్తున్నాయి. బ్యాంకు అధికారులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఫైనాన్సర్ల వద్ద అప్పులు చేసి వడ్డీ కట్టుకోలేక అవస్థలు పడుతున్నామని తయారీదార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఇన్ని ఇబ్బందులను ఓర్చుకొని బొమ్మలు తయారుచేస్తున్న వీరిని కరోనా మరింత కృంగదీసింది. మార్కెట్ లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు స్పందించి కనీసం ముడిసరుకు కొనుగోలుకైనా రుణాలు మంజూరు చేయాలని, తమ బొమ్మలకు తగిన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆహ్లాదకరంగా ధారమఠం

ప్రజాశక్తి-గొలుగొండ

గొలుగొండ మండలంలోని ధారమఠంలో వెలసిన ధారమల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంతం చూపరులను ఎంతగానే ఆకట్టుకుంటోంది. అక్కడికి వెళ్లేవారికి దేవుడి దర్శనంతో పాటు ఆహ్లాదం, ఆనందకరమైన వాతావరణం కనువిందు చేస్తోంది. దీంతో ఈ ఆలయానికి నిత్యమూ సందర్శకులు, భక్తులు వస్తూనే ఉంటారు. పచ్చని చెట్లతో నిండి ఉన్న కొండల నడుమ బండరాళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న సెలయేరు ఒక వైపు, విశాలంగా ఉన్న జీడి తోటలు మరో వైపు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తాయి. మన్యంలో తెల్లదొరలపై విప్లవం చేసిన అల్లూరి సీతారామరాజు ఎక్కువగా ఇక్కడ గడిపేవారని పెద్దలు చెబుతుంటారు. పవిత్ర దినాల్లోనూ ప్రాధాన్యత కలిగిన కార్తీక మాసంలోను, ఈ ప్రాంతం అంతా శివ పూజలు చేసే భక్తులు, వన భోజనాలకు వచ్చే సందర్శకులతో సందడిగా ఉంటుంది. సందర్శకుల సౌకర్యార్థం స్నానపు గదులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గది, విశ్రాంతి తీసుకోవడానికి షెడ్లను టూరిజం శాఖ వారు ఏర్పాటుచేసింది. భక్తులు పూజలు చేసుకోవడానికి, సందర్శకులు ఆహ్లాదంగా గడపటానికి అన్ని వసతులు ఇక్కడ ఉండటంతో కార్తీక మాసమంతా దూర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. శివరాత్రికి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి ధారమల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి సోమవారమూ ఈ ఆలయానికి భక్తుల తాకిడి అధిక సంఖ్యలో ఉంటుంది. ప్రతి ఆదివారమూ గొలుగొండలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆహ్లాదాన్ని



పంచుకునేందుకు పిక్‌నిక్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ఆలయం అభివృద్ధి

ఒకప్పుడు గొలుగొండ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసిన సుబ్రమణ్యం దాతల సహకారంతో దేవాలయాన్ని నిర్మించారు. మట్టి రోడ్డు ద్వారా వాటర్ ఫాల్స్‌కు వెళ్లేందుకు భక్తులు ఇబ్బంది పడుతుంటే కొత్తమల్లంపేటకు చెందిన ధరణి ఇన్‌ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారి నాతిరెడ్డి వరహాలబాబు రూ.8లక్షలతో మెట్లను ఏర్పాటుచేశారు. ఇప్పుడు అక్కడకు వెళ్లేందుకు భక్తులకు ఎంతో సులభతరం అయింది.

ఆలయానికి ఇలా వెళ్లాలి

గొలుగొండ నుంచి ఐదు కిలో మీటర్లు దూరం ప్రయాణం చేస్తే ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. గొలుగొండ నుంచి తారురోడ్డు ఉండటంతో ఇక్కడకు చేరుకోవడానికి అన్ని రకాల వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రకృతి అందాలకు నెలవు...

రేవు పోలవరం తీరం



• ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న తీరప్రాంత గ్రామం

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : ప్రకృతి అందాలకు నిలయంగా అనకాపల్లి జిల్లాలోని రేవుపోలవరం తీరం ప్రసిద్ధి కెక్కింది. అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్ రాయవరం మండలంలోని తీరప్రాంత గ్రామమే రేవుపోలవరం. సువిశాలమైన సముద్రతీరంతో పాటు, సముద్రం మధ్యలోకి వెళ్ళేందుకు వీలుగా జెట్టీ చూపరులను, పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఆధ్యాత్మికంగా సముద్రం ఒడ్డున కొండపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ మాధవ స్వామి ఒకవైపు, మరొక కైలాసగిరిలా భాసిల్లే శివపార్వతుల విగ్రహాలు మరొకవైపు, భక్తుల అభీష్టం నెరవేర్చే షిర్డీసాయి మందిరం ఇంకోవైపు ఇలా ఆధ్యాత్మిక శోభతో కూడిన పర్యాటక కేంద్రం ఇది.

ఏటా మాఘ పౌర్ణమి జాతరకు వివిధ జిల్లాల నుండి భక్తులు సముద్రస్నానాలు చేసేందుకు వస్తుంటారు. కార్తీకమాసం నెలరోజులు తీరంలో సందడి మాటలలో చెప్పలేనిది. జిల్లా నలుమూలల నుండే కాకుండా తూర్పుగోదావరి, అల్లూరి జిల్లా నుండి కూడా పర్యాటకులు వచ్చి సముద్రతీరం అందాలను ఆస్వాదించి వెళుతుంటారు.

గతంలో టిడిపి హయాంలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేసినప్పటికి, గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పర్యాటకులకు స్వర్గధామంగా ఉండే రేవుపోలవరం తీరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



రేవు పోలవరంలోని పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు